# వార్త

ఆదివారం

22 సెప్టెంబరు, 2024

# కాలుష్య కడలిలో క'న్నీటి' వరద



తారాతీరం



# అతిథి పాత్రలో సల్మాన్ ఖాన్?

విక్టరీ వెంకటేష్ ప్రస్తుతం డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా షూటింగులో వెంకీ ఫుల్ బిజీగా ఉన్నాడు. ఇందులో మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమాలో అతిథి పాత్రలో ఓ బాలీవుడ్ స్టార్ నటించనున్నట్లు తెలుస్తోంది. ఆ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ అని సమాచారం. ఇందులో ఎంత వాస్తవ ముందో చూడాలి మరి! ఇంకా టైటిల్ నిర్ణయించని ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ఉపేంద్ర లిమాయే, రాజేంద్ర ప్రసాద్, సాయికుమార్, నరేష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా విడుదల కానుంది.

# గ్రామీణ నేపథ్యంలో 'క' చిత్రం

కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా 'క'. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ భాషలో ఈ చిత్రం విడుదల కాబోతుంది. మాలీవుడ్ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ మలయాళంలో 'క'ను విడుదల చేయబోతున్నాడు. దుల్కర్ సల్మాన్ నటుడు మాత్రమే కాదు, నిర్మాత కూడా. వేఫేరర్ ఫిల్మ్స్ పేరుతో ఇతనికి ఓ ప్రొడక్షన్ హౌస్ ఉంది. ఈ నేపథ్యంలో 'క' సినిమాని విడుదల చేసేందుకు ముందుకు వచ్చాడు. 'క' సినిమాలో కిరణ్ అబ్బవరం జోడీగా నయన్ సారిక, తన్వీరామ్ కథానాయికలుగా నటిస్తున్నారు. శ్రీమతి చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీ చక్రాస్ ఎంటర్టైన్మెంట్స్ పతాకం మీద చింతా గోపాలకృష్ణ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ సినిమాకు దర్శక ద్వయం సుజీత్, సందీప్ దర్శకత్వం వహిస్తున్నారు.



ఆదివారం వార్త

22 సెప్టెంబరు, 2024

## మంచి ముత్యాలు

మంచి నడవడిని మించిన అలంకారం
మరొకటి లేదు

- భర్తృహరి

## విషయ విశేషం

'పుడక'తో అందం ఆరోగ్యం... 4

'సంఘీ'భావం....5

విజృంభిస్తున్న వైరల్ జ్వరాలు

కవర్ స్టోరీ..6

కాలుష్య కడలిలో
క'న్నీటి' వరద!

ఇంటిని మెరిపించే ఇటుకలు....10

ఈవారం కవిత్వం..12

ఒక బాణం-ఒక గానం

ఆందోళనలో అంతరిక్ష పరిశోధనలు..14

గుహలో కొలువు తీరిన.....18

కథ.. 20

మూడో మనిషి

కథ.. 23

అమ్మభాషను మరవద్దు

నైరుతి దిక్కు ప్రత్యేకత....25

మన ఆలోచనలే మనకు.... 28

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం


వగైరా..వగైరా..

## తాజా వార్తలు

### కళాపోషణ ఉండాలి



రోజూవేసే ముగ్గే కావొచ్చు..కొంతమంది మనసు పెట్టి ఎంత ముచ్చటగా వేస్తారో! మరికొందరు ఏ కాస్త తీరిక దొరికినా చేతనైనట్లుగా ఏవో బొమ్మలు వేస్తుంటారు. సాధారణ ఉద్యోగులతో పోలిస్తే తమ ఖాళీ సమయాన్ని ఇలా సృజనతో నింపేసేవారిలో పనిసామర్థ్యం మెరుగ్గా ఉంటోందని చెబుతోంది ఓ పరిశోధన. యూకేలోని ఆంగ్లియా రస్కిన్ యూనివర్సిటీ దీన్ని నిర్వహించింది. ఇందుకోసం సుమారు ఏడువేల మంది ఉద్యోగుల్ని పరిశీలించింది. ఇంటికొచ్చినా ఆఫీసు పనితో సతమతమయ్యేవారితో పోలిస్తే ఏదో ఒక కళ, అభిరుచిలో నిమగ్నమయ్యేవారిలో మానసిక ఆరోగ్యం మెరుగ్గా ఉంటోందని తేల్చింది. జీవితంపట్ల సంతృప్తితోపాటు..వీళ్ల మనసులోని మాటను చక్కగా వ్యక్తీకరించగలుగుతున్నారంటోంది. దానివల్ల ఉద్యోగ జీవితంలోనూ మెరుగైన ఫలితాలు అందుకుంటున్నారని చెబుతోంది. కొవిడ్ సమయంలో ఏదైనా ఒక కళని సాధన చేసిన వారు తక్కిన వారితో పోలిస్తే త్వరగా కోలుకున్నారనీ వివరిస్తోంది. కళాకారులు లేదా ఎంతోకొంత సృజన ఉన్నవాళ్లకి విసుగూ, ఒంట రితనాలు దరిచేరే ప్రసక్తే లేదంటోంది. కళ అంటే ఇష్టం ఉండీ ఉద్యోగ జీవితంలో కొట్టుకునిపోయేవారు కాస్త తీరిక చేసుకుని నచ్చిన అభిరుచిలో లీనమైతే మేలని సూచిస్తోంది.




మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com

# 'పుడక'తో అందం ఆరోగ్యం

**నాసాగ్రే నవమౌక్తికం అని శ్రీకృష్ణుని అందాన్ని వర్ణిస్తూ ఏనాడో చెప్పారు. ముక్కుపుడకను ధరించే సంప్రదాయం హిందూమతంలో అనాదిగా ఉంది. భారతీయ సంస్కృతిలో హిందూమతం ప్రకారం ఆడవారికి ముక్కు, చెవులు కుట్టడం అనేది ఒక ప్రత్యేకమైన ఆచారంగా ఉంది. అలాగే ఇంకొన్ని వర్గాల తరపున మగవారు కూడా ఈ పద్ధతిని అనుసరిస్తుంటారు.**




ఆనంద 'మైత్రేయ'మ్

మన సంప్రదాయంలో ముక్కుపుడకలకు ప్రత్యేకస్థానం ఉంది. దేశంలో ప్రాంతాన్ని బట్టి ముక్కుపుడక ధరించే పద్ధతి వేరుగా ఉంటుంది. ముక్కుపుడకలు ధరించడం వల్ల వారికి అనేకమైన



ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని, దేశంలోని తూర్పుమధ్య ప్రాంతంలో ఉన్నవారు చాలా గట్టిగా నమ్ముతారు. ముక్కుపుడకను కొన్ని రకాల లోహాలతో చేయడం వల్ల అది చెడను శోషించుకుని గాలిని స్వచ్ఛంగా మార్చి ధరించిన వాళ్లని అనారోగ్యానికి దూరంగా ఉంచుతుందని చెబుతుంటారు. కానీ శాస్త్రపరంగా చూస్తే మాత్రం ఇది ఒక మూఢనమ్మకంగా ఉంటుంది. ముక్కు కుట్టడం గురించి కథనాలు ఎలా ఉన్నా, మహిళలు ముక్కుపుడక పెట్టుకోవడం అనేది మాత్రం ముఖ్యమైన ఆచారంగా చెబుతారు. ఈ ముక్కుపుడక సంప్ర దాయం కేవలం హిందూమతంలోనే కాకుండా ఇతర మతాల మహిళల్లో కూడా కనబడుతుంది. మతపరంగా ముక్కుపుడకను వివాహదృష్ట్యా పార్వతీదేవి గౌరవ సూచకంగా చూస్తా రు. సాధారణంగా ముక్కుపుడక ధరించ డమనేది హిందూ సంప్రదాయం ప్రకారం వివాహసూచికగా కనిపిస్తుంది. పదహారేళ్ల వయస్సులో అమ్మాయిలు ముక్కుపుడక ధరించడం అనేది పెళ్లికి సిద్ధమని చెబుతుంది. సంప్రదాయం ప్రకారం భర్త మరణంతోనే ముక్కుపుడక తొలగించబడుతుంది. సాధారణంగా 5,7,11 సంవత్సరాల్లో ఆడపిల్లలకు ముక్కుకుట్టిస్తారు. లేదా వివాహానికి సంసిద్ధమైన ఆడపిల్లకు ముక్కు కుట్టిస్తారు. వివాహ సమయానికి ఆడపిల్ల ముక్కుకి పుడక తప్పనిసరిగా ఉండాలని ఇప్పటికీ చాలా కుటుంబాల్లో భావిస్తారు. చిన్న వయస్సులో ముక్కు కుట్టించడం ఆరోగ్యానికి చాలామంచిది.

ముక్కుకి కుడివైపున సూర్యనాడి ఉంటుంది. కుడివైపు ముక్కుకు మండలాకారమైన ఒకరాయి ధరించాలని శాస్త్రాలు చెప్తున్నాయి. అలాగే ఎడమవైపున చంద్రనాడి ఉంటుంది. అందువల్ల ముక్కుకు ఎడమవైపున అర్ధచంద్రాకారంలోని ముక్కుపుడక ధరించాలని పండితులు చెప్తున్నారు. ముక్కు ఎడమవైపున ముక్కుపుడక ధరించడం ద్వారా ఆడవారికి గర్భకోశవ్యాధులు తగ్గుతాయట. పురుటి నొప్పులు ఎక్కువ కలగకుండా సుఖప్రసవం అవడానికి సహకరిస్తుందట. కన్ను, చెవికి సంబంధించిన నరాలు ఆరోగ్యంగా ఉంటాయట.



సంబంధించిన వ్యాధులు అనగా చెవిపోటు, చెవుడు వంటివి కలుగకుండా ముక్కుపుడక సహాయపడుతుంది. అంతేకాదు దీన్ని ధరించడం వల్ల శ్వాస సంబంధిమైన వ్యాధులు ధరిచేరవు ప్రత్యుత్పత్తి మెరుగుపడుతుందని వైద్యులు చెప్తున్నారు. ముక్కు కుట్టడం ద్వారా మహిళల్లో నెలసరి సమయంలో వచ్చే నొప్పి తగ్గుతుందనే విషయాన్ని కూడా బామ్మలు చెబుతుంటారు. ఎడమవైపు ముక్కుపుడక ధరించడం వల్ల

**(మిగతా 11వ పేజీలో)**

'సంఘీ' భావం



# విజృంభిస్తున్న వైరల్ జ్వరాలు

వాతావరణంలో మార్పులు రావడంతో ఒక్కసారిగా వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. అంటువ్యాధులైన ఈ జ్వరాలు ప్రతి సీజన్‌లో వచ్చేవే అయినా ఈసారి వాటి ప్రభావం కొంత అధికంగా ఉంది. గ్రామాల నుంచి నగరాల వరకు ఉన్న అన్ని ఆసుపత్రుల్లో జ్వరాలతో చేరుతున్న వారి సంఖ్య అధికంగా ఉంటోంది. వర్షాలు కురియడం, వరదలు సంభవించడం, తాగునీరు కలుషితం కావడంతో పాటు వైరల్ వ్యాప్తి జరుగుతుంది. ముఖ్యంగా దోమకాటు నుంచి వచ్చే డెంగ్యూ, చికున్‌గున్యాల బారిన పడిన వారి సంఖ్య ఈసారి అధికంగా ఉంది. దోమల ఉత్పత్తి జరిగే ప్రాంతాలను గుర్తించి వాటిని అంతమొందించే చర్యలు తీసుకోవాలి. స్థానిక సంస్థలు, మున్సిపాలిటీ అధికారులు వీటిని పర్యవేక్షించాల్సి ఉన్నప్పటికీ తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ వీటి నివారణకు కృషి చేయాలి. ఇళ్లలో ఉండే పూల కుండీలు, వాడి వదిలేసిన కొబ్బరి బోండాలు, వాహనాలకు ఉపయోగించే టైర్లు, నీరు ప్రవహించని మురుగు కాల్వలు, కుంటలు దోమల ఉత్పత్తికి కారణంగా ఉంటాయి. నీరు నిల్వ ఉండకుండా చూడటం ద్వారా దోమలను నివారించవచ్చు. ఇంటికి సమీపంలో మురికినీరు నిల్వ ఉంటే వాటిలో ఫెనాయిల్ వేయడం గాని, వాహనాలకు ఉపయోగించిన తరువాత విడుదల అయ్యే ఆయిల్‌ను గుడ్డలో తడిపి గాని వేస్తే దోమల ఉత్పత్తి జరగదు. ఇళ్లలో కూడా దోమతెరలు గాని, ఆల్‌అవుట్ వంటి పరికరాలు గాని ఉపయోగించి దోమలు ఇంట్లోకి రాకుండా నిరోధించుకోవల్సిన అవసరం ఉంది. వైరల్ జ్వరాలు తగ్గే వరకు సాధ్యమైనంత వరకు కాచి చల్లార్చిన నీటిని తాగడం మంచిది. సురక్షితమైన నీటిని మాత్రమే తీసుకోవడం ద్వారా జ్వరాలు రాకుండా నిరోధించవచ్చు. అదేవిధంగా వేడివేడి భోజనం చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ముఖ్యంగా గమనించాల్సింది వైరల్ జ్వరాలకు యాంటీ బయోబయాటిక్ మందులు ఏమాత్రం పనిచేయవు. జ్వరం తగ్గడానికి, దగ్గు, జలుబు వంటివి ఉంటే వాటి నుంచి ఉపశమనం పొందేందుకు అందుబాటులో ఉండే సాధారణ మందులు ఉపయోగించాలి. వైరల్ జ్వరం వస్తే సుమారు నాలుగైదు రోజులు ప్రతి రోజు జ్వరం ఉంటుంది. ఇతర రుగ్మతలతో బాధపడే వారు మినహా మిగిలిన వారు ఈ జ్వరాలతో భయాందోళన చెందాల్సిన అవసరం ఉండదు. అయితే డెంగ్యూ సోకితే మాత్రం జాగ్రత్తలు, వైద్య చికిత్స అవసరం. సాధ్యమైనంత వరకు విశ్రాంతి తీసుకుంటూ పౌష్టికాహారం భుజిస్తే నీరసం, జ్వరం నుంచి త్వరగా బయటపడే అవకాశం ఉంటుంది. 55 సంవత్సరాలు దాటిన వారికి వైరల్ జ్వరం సోకినప్పుడు ఆక్సిజన్ లెవెల్స్ తగ్గే ప్రమాదం ఉంటుంది. దీనికి వైద్యుల సలహాలు తీసుకోవడం మంచిది. పండ్ల రసాలు, సూప్‌లు వంటివి తీసుకోవచ్చు. పాలు, పాల ఉత్పత్తులను కూడా తీసుకోవచ్చు గాని కొన్ని సందర్భాల్లో అతిసారానికి దారితీసే ప్రమాదం ఉంది. అతిసారం ఇబ్బంది లేకపోతేనే పాలు తీసుకోవాలి. కొన్ని సందర్భాల్లో రక్తంలో ప్లేట్‌లెట్స్ గణనీయంగా తగ్గుతాయి. వైద్యులు ఇచ్చే మందులతో పాటు తృణధాన్యాలు, బచ్చలి, నారింజ వంటివి ఎక్కువగా తీసుకోవాలి. శరీర ఉష్ణోగ్రత 100 డిగ్రీలు దాటి మూడు రోజుల పాటు కొనసాగితే వైద్యుడిని సంప్రదించడం మంచిది. డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధులకు తప్పనిసరిగా నిపుణుల వైద్య సూచనలు, మందులు వాడటం మంచింది. అతిచల్లగా ఉండే పదార్థాల ద్వారా కూడా వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతాయి. అదేవిధంగా ఒకరు ఉపయోగించిన వస్తువులను, దుస్తులను, తువాళ్లను మరొకరు ఉపయోగించకుండా ఉండటం ఉత్తమం. ముఖ్యంగా ఇంట్లో ఎవరికైనా వైరల్ జ్వరం వస్తే సాధ్యమైనంత వరకు ఒంటరిగా ఉండేందుకు ప్రయత్నించండి. రెండు మూడు రోజులు వరుసగా జ్వరం రావడం, చెమటలు పట్టడం, ముక్కు కారడం, ముక్కు దిబ్బడ, గొంతు నొప్పి, వికారం, వాంతులు రావడం, చలిగా అనిపించడం, ఆకలి లేకపోవడం, నీరసంగా, అలసటగా ఉండటం, కండరాల నొప్పులు, అతిసారం, కడుపు నొప్పి వంటి లక్షణాలు వైరల్ జ్వరాల్లో కనిపిస్తాయి. ఫ్లూ అంటువ్యాధి శ్వాసకోశ బిందువుల ద్వారా వ్యాప్తి చెందుతుంది. డెంగ్యూ వైరస్ దోమల ద్వారా వ్యాప్తిస్తుంది. దీనికి తక్షణ చికిత్స అవసరం. చికున్‌గున్యా దోమలద్వారా వ్యాప్తి చెందుతుంది. ఇది కీళ్లలో తీవ్రమైన నొప్పి కలిగిస్తుంది. జికా వైరస్ ఏడెస్ దోమల ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఇది నాడీ సంబంధ వ్యాధులను కలిగి ఉంటుంది. వెస్ట్ నైల్ వైరస్ కూడా దోమకాటుతో వృద్ధి చెందుతుంది. వీటితో పాటు వివిధ రకాల వైరస్‌లు ఈ సీజన్‌లో వ్యాప్తి చెందుతూ ఉంటాయి. వ్యాధి నిర్ధారణను సాధ్యమైనంత వరకు లక్షణాలను బట్టి వైద్యులు గుర్తిస్తారు. ముందుగా సాధారణ మందులు ఇస్తారు. లక్షణాలు ఏమాత్రం తగ్గుముఖం పట్టకపోతే క్లినికల్ పరీక్షల ద్వారా వ్యాధినిర్ధారణ చేస్తారు. డెంగ్యూ వ్యాధికి మినహా మిగిలిన జ్వరాలకు ఆసుపత్రిలో చేరాల్సిన అవసరం అంతగా ఉండదు. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారికి వైరల్ సోకితే వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందాలి. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో వైరల్ జ్వరాల తీవ్రత అధికంగా ఉంది. ఆసుపత్రులన్నీ రోగులతో కిటకిటలాడుతున్నాయి. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం ద్వారా వైరల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ప్రయత్నించాలి. జ్వరం వచ్చిన తరువాత ఆందోళనకు గురికాకుండా సరైన చికిత్స తీసుకుని ఉపశమనం పొందే దుకు ప్రయత్నించాలి. ముఖ్యంగా రోగనిరోధక శక్తిని పెంపొందించుకునేందుకు వ్యాయామాలు, యోగా చేయడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలి.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# కాలుష్య కడలిలో క'న్నీటి' వరద!

కవర్ స్టోరీ

షేక్ అబ్దుల్ వాహీం జాని

**పర్యావరణం** అంటే అర్థం భూమి, నీరు, గాలి, చెట్లు, జీవజంతు జాతుల రూపంలో మన చుట్టూ ఉన్న ప్రకృతి. పర్యావరణం మానవ మనుగడకు, అభివృద్ధికి అత్యంత ఆవశ్యకం. మనుగడకు అవసరమైన బాహ్యాపరిస్థితుల (భూమి, గాలి, నీరు, ఆహారం, వెలుతురు, వేడి, చలి) లభ్యతనే పర్యావరణం అంటారు. ప్రకృతిలో సహజంగా ఏర్పడే చర్యల వల్ల జరిగే కాలుష్యాలను సహజ కాలుష్యాలు అంటారు. మానవుడు సాధించిన ప్రగతి వలన వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది. దీన్ని కృత్రిమ కాలుష్యం అంటారు. ప్రాణికోటి మనుగడ క్షేమంగా ఉండాలంటే పర్యావరణం బాగుండాలి. మానవ తప్పిదాల వల్ల ఇప్పటికే ఓజోన్‌పొర ఛిద్రమై ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోయాయి. వాతావరణ మార్పులపై పరిశోధనలు చేస్తున్న మూడు ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ఒకటైన స్టాక్‌హోం రెజిలియన్స్ సెంటర్ (ఎస్‌ఆర్‌సీ) అందించిన సమాచారం ఆందోళన కలిగిస్తుంది.

ప్రకృతి వనరులు విచ్చలవిడి వినియోగతీరును బట్టి, భూతాపాన్ని బట్టి భూగోళం ఆరోగ్యాన్ని 9అంశాల ప్రాతిపదికగా అంచనా వేశారు. వీటిలో వ్యవసాయం, ఆహారం వ్యవస్థ, నీటి వినియోగం, జీవావరణ సమగ్రత, భూమి వినియోగ మార్పిడి, నత్రజని, ఫాస్పరస్ వంటి రసాయనాల వాడకం ఇత్యాదివి ఉన్నాయి. కాలుష్యాన్ని పెంచిపోషించడంలో 2022 నాటికే ప్రపంచ మానవాళి హద్దులు దాటేసింది. నేడు పర్యావరణం సమతౌల్యత కోల్పోయింది. పులి మీద పుట్రలా ఇటీవల జరుగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్-పాలస్తీనా యుద్ధంలో ఉపయోగిస్తున్న ఆయుధాల వల్ల పంచభూతాలు కలుషితమౌతున్నాయి. రణం వల్ల పర్యావరణం కలుషితమై ప్రాణికోటి మరణానికి కారణమౌతుంది. భూగోళం వేడెక్కుతుంది. గత 13నెలల్లో ప్రపంచంలోని అన్ని దేశాలలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందనేది సునాయాసంగా అర్థమౌతుంది. విలువైన పర్యావరణానికి మానవులు చేస్తున్నత హాని ఈ సృష్టిలో ఏ జీవి చేయడం లేదంటే అతిశయోక్తి కాదు.

## మానవ నిర్మిత పర్యావరణం

మానవ నిర్మిత పర్యావరణం అనేది మానవ కార్యకలాపాల ద్వారా సృష్టించి, సవరించిన పర్యావరణం. ఇందులో నగరాలు, రోడ్లు, భవనాలు, ఇతర మౌలిక సదుపాయాలు ఉంటాయి. పర్యావరణం అనేది మానవ ఆరోగ్యంపై గణనీయమైన ప్రభావాలను కలిగి ఉంటుంది.

మానవ నిర్మిత పర్యావరణాలు సామాజిక, ఆర్థిక అభివృద్ధికి వనరులు, అవకాశాలు వంటి అనేక ప్రయోజనాలను కలిగి ఉంటుంది. మానవ నిర్మిత పర్యావరణాలు సామాజిక, ఆర్థిక అభివృద్ధికి వనరులు, అవకాశాలు వంటి అనేక ప్రయోజనాలను కూడా అందించ గలవు. అయినప్పటికీ అవి కాలుష్యం, నివాస విధ్వంసం, వాతావరణ మార్పులతో సహా అనేక సవాళ్లను కూడా ఎదుర్కొనేలా చేస్తున్నాయి. పర్యావరణాన్ని నాలుగు ప్రధాన రకాలుగా వర్గీకరించవచ్చు. భూసంబంధమైన పర్యావరణం, వాతావరణ పర్యావరణం, జల పర్యావరణం, మానవ నిర్మిత పర్యావరణం ఇత్యాదివి.

## భూసంబంధమైన పర్యావరణం

భూసంబంధమైన పర్యావరణం అనేది అడవులు, గడ్డి భూములు, ఎడారులు, ఇతర పర్యావరణ వ్యవస్థలను కలిగి ఉన్న భూ ఆధారిత పర్యావరణం. ఉష్ణమండల వర్షారణ్యాలు, సమశీతోష్ణ అడవులు, సవన్నాలు, టండ్రా, ఎడారులు వంటి పలు రకాల పర్యావరణ వ్యవస్థలకు దారితీసే వృక్షసంపద, గడ్డిభూములు, అనేక జాతుల మొక్కలు, జంతువులకు ఆవాసాలను అందించడంలో భూసంబంధమైన పర్యావరణాలు కీలకపాత్ర పోషిస్తాయి.

## నేల కాలుష్యం

వరల్డ్ ఎకనామిక్ ఫోరం నివేదిక ప్రకారం భారత్‌లో ఏటా యాభైఆరు లక్షల టన్నులకు పైగా చెత్త పోగు పడుతోంది. ఇలా 2020 నాటికి పేరుకునే 12 బిలియన్ టన్నుల చెత్తని శుభ్రపరచడానికి వందల సంవత్సరాలు పట్టవచ్చని అంచనా.

మనిషి పవిత్రమైన భూమిని తన స్వార్థ ప్రయోజనాలు, సుఖభోగాల కోసం అనేక రకాలుగా నష్టపరుస్తున్నాడు. ఆహారం, జీవనాన్ని ఇచ్చే భూమిని నాశనం చేస్తున్నాడు. గృహ వ్యర్థాలు, చెత్తాచెదారం వల్ల భూసారం దెబ్బతింటోంది. మనదేశంలో ప్రతిరోజూ 15వేల టన్నుల కంటే ఎక్కువగా చెత్త ఉత్పత్తి అవుతోంది. కొన్ని పట్టణ ప్రాంతాలు చెత్త, ప్రమాదకర వ్యర్థాలను, ద్రావకాలు, పారిశ్రామిక రంగులు, వ్యర్థాలను, పారవేయడం గురించి తీవ్రమైన సమస్యను ఎదుర్కొంటున్నారు. చెత్త అధికంగా పేరుకుపోయి, ఏం చేయాలో పాలుపోక కొందరు తగలబెట్టడమే పరిష్కారంగా భావిస్తున్నారు. ఇలా చేయడం అనేది వాయు కాలుష్యానికి దోహదపడుతుంది. 2004 నుండి జరిపిన అధ్యయనాలు గ్రీస్ దేశం వ్యర్థాలలో 10శాతం మాత్రమే రీసైక్లింగ్ చేసిందని, 90శాతం పల్లపు ప్రదేశాలలో ఉంచినట్లు తెలుస్తుంది. డెన్మార్క్ దాదాపు 30శాతం రీసైకిల్ చేసి, 60శాతం భస్మం చేసి కేవలం 10శాతం వ్యర్థాలను మాత్రమే పల్లపు ప్రాంతాలకు పంపుతుంది. ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ ఏజెన్సీ ప్రకారం యునైటెడ్ స్టేట్స్ తన చెత్తలో 30శాతానికి పైగా రీసైకిల్ చేస్తుంది. గత 15 ఏళ్లలో ఈ రేటు దాదాపు రెట్టింపు అయింది. రీసైక్లింగ్ అనేది పూర్తిస్థాయిలో చేయలేకపోతున్నారు. ఇలా చేయకపోవడం వల్ల కూడా పర్యావరణానికి పెనుముప్పుగా మారింది.



## వాతావరణ పర్యావరణం

వాతావరణం అనేది భూమి చుట్టూ ఉన్న వాయు పొరను సూచిస్తుంది. ఇందులో మనం పీల్చే గాలి, వాతావరణ నమూనాలు, వాతావరణం ఉంటాయి. వాతావరణ నమూనాలు, వాతావరణం అనేవి భూమి ఉష్ణోగ్రత, వాతావరణాన్ని నియంత్రించడంలో కీలక పాత్ర పోషస్తున్న ఆక్సిజన్, నైట్రోజన్, కార్బన్-డై-ఆక్సైడ్, నీటి ఆరి వంటి వివిధ వాయువుల ఉనికిని కలిగి ఉంటుంది. గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలకు, వాతావరణ మార్పులకు దోహదపడే శిలాజ ఇంధనాలను కాల్చడం, అటవీ నిర్మూలన వంటి మానవ తప్పిదాల వల్ల వాతావరణ పర్యావరణం కూడా ప్రభావితమవుతుంది.

## వాయు కాలుష్యం

ప్రస్తుతం పెరుగుతున్న పట్టణీకరణ, వాహనాల నుండి వచ్చే పొగతో వాయు కాలుష్యం పెరిగిపోతోంది. మానవ ప్రేరిత చర్యల వల్ల వాతావరణంలో కొన్ని విషపూరితమైన వాయువులు చేరి, ప్రాణవాయువు తగ్గిపోతోంది. 2016లో వెలువడ్డ ఒక సర్వేరిపోర్ట్ ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 90శాతం ప్రజలు కలుషితమైన వాయువులు పీలుస్తున్నారు. దీని కారణంగా అనేక రకాలైన శ్వాసరోగాలు, కేన్సర్ వంటి భయంకరమైన వ్యాధులు సంభవిస్తున్నాయి. వేగంగా విస్తరిస్తున్న ఈ కాలుష్యం వల్ల సహజంగానే సమస్త ప్రాణికోటి, వృక్షజాతులు ప్రమాదంలో పడ్డాయి. దేశంలో ఉన్న శాస్త్రవేత్తలు, మేధావులు, స్వచ్ఛంద సేవకులు ఈ సమస్యను అధిగమించడానికి అనేక రకాల ప్రాజెక్టులు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 50వేల కంటే ఎక్కువ జనాబా ఉన్న అన్ని నగరాల్లో వాయు కాలుష్యం కొంతమేరకు ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

## జల పర్యావరణం

జల పర్యావరణం అంటే సముద్రాలు, సరస్సులు, నదులు, చిత్తడి నేలలు, ఇతర నీటి వనరులను కలిగి ఉన్న నీటి ఆధారిత పర్యావరణం. నీటి లవణీయత ఆధారంగా నీటి పర్యావరణాన్ని మంచినీరు, సముద్ర పర్యావరణ వ్యవస్థలుగా వర్గీకరించవచ్చు. చేపలు, ఉభయచరాలతో సహా ఏక రకాల జీవులకు జల పర్యావరణం నిలయంగా ఉంది. భూగోళంపై 80శాతం జలం విస్తరించి ఉంది. అయినప్పటికీ తాగడానికి ఉపయోగపడే శుద్ధమైన నీరు దొరకడం లేదు. స్వచ్ఛమైన నీటి లభ్యత మూడుశాతం కంటే తక్కువగా ఉంది. ఎక్కువ శాతం నీరు కలుషితం కావడం, ఉప్పు నీటి రూపంలో ఉంది. లభించే కొద్దిపాటి శుద్ధజలం మానవ చర్యలవల్ల పనికిరాకుండాపోతోంది. దీనివల్ల కేవలం మనుషులేకాక సమస్త ప్రాణికోటితో పాటు ముఖ్యంగా జలచరాలు తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయి. భూగర్భజల కాలుష్యాన్ని ఆపడానికి మనం తీవ్రంగా ప్రయత్నం చేయవలసి ఉంటుంది. ఎందుకంటే వ్యవసాయానికి, తాగడానికి స్వచ్ఛమైన నీరు అత్యంత ఆవశ్యకం. జలాన్ని సంరక్షించడం, పరిశుభ్రంగా ఉంచడం మనందరి నైతిక బాధ్యత. మన సంస్కృతిలో నదులను మాతగా పూజిస్తారు. తల్లిగా భావించే గంగ, యమున, గోదారి వంటి నదుల పరిస్థితి మనకు తెలియంది కాదు. పవిత్రజలాలను మనమే కలుషితం చేసుకుంటున్నాం. నివాస ప్రాంతాల నుంచి వచ్చే వ్యర్థాలు, చెత్త చెదారం, పరిశ్రమల నుండి వచ్చే విషతుల్య రసాయనాలు నదులలో కలుస్తున్నాయి. దీని పర్యవసానంగా దేశంలో ఉన్న ప్రముఖ నదులన్నీ పెద్ద మురికి కాలువలుగా మారిపోతున్నాయి. ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకున్నా వీటిని పూర్తిస్థాయిలో ఆపడం సాధ్యం కావడం లేదు. చివరకు సముద్ర జలాలు సైతం కాలుష్యానికి గురౌతున్నాయి. కాబట్టి నదులను కాపాడుకోవడానికి ప్రభుత్వాలతోపాటు ప్రతి ఒక్కరూ విధిగా పూనుకోవాలి. మానవులు చిన్నాచితకా నదులు, కాల్వలు, చెరువులను సైతం విడిచి పెట్టడం లేదు. ఒకప్పుడు ప్రతిఒక్కరూ ఉచితంగా భించే ఆరోగ్యకరమైన భూగర్భ జలాలనే తాగేవారు. నేడు పెరిగిపోయిన కాలుష్యం వల్ల భూగర్భ జలాలను తాగేవారి సంఖ్య గణనీయంగా తగ్గి పోయింది. అందరూ శుద్ధి చేసిన జలాన్ని కొనుక్కుని మరీ తాగుతున్నారు. భూగర్భ జలాలను నిత్యావసర కార్యక్రమాలను వాడుకుంటున్నారు. ఇంకుడు గుంటలు చాలాచోట్ల లేకపోవడం వల్ల భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి.

## శబ్ద కాలుష్యం

ఒకప్పుడు శబ్ద కాలుష్య తక్కువగా ఉండేది. నేడు పెరిగిపోయిన మోటారు వాహనాలు, డిజె సౌండ్ వల్ల శబ్ద కాలుష్యం పెరిగిపోయింది. ధ్వని తీవ్రతను డెసిబెల్స్‌లో కొలుస్తారు. ఉదాహరణకు ఉరుము చప్పట్లు దాదాపు 100 డెసిబుల్స్ తీవ్రతను కలిగి ఉంటాయి. 120 డెసిబెల్ స్థాయిలో లేదా అంతకంటే ఎక్కువ శబ్దం వింటే హాని కలుగుతుంది. నగరాల్లో శబ్ద కాలుష్యం అనూహ్యంగా పెరిగిపోయింది.

# విజయవాడ వరదలు ఓ గుణపాఠం



**ఇటీవల** భారీగా కురిసిన వర్షాల వల్ల విజయవాడకు కనీ వినీ ఎరుగని రూపంలో భారీ వరదలు ఒక్కసారిగా వచ్చాయి. అందరూ చూస్తుండగానే గంటల వ్యవధిలో అపార్ట్‌మెంట్లను, ఇళ్లను పూర్తిగా ముంచేశాయి. దీనితో సర్వం కోల్పోయినవాళ్లు కట్టుబట్టలతో మిగిలారు. దాదాపు 50 వేల ఇళ్లు, 3 లక్షల మంది ప్రజలు వరద గుప్పిట్లో చిక్కుకుని పోయారు. బుడమేరు వాగు ప్రవాహం శాంతినగర్, ఇబ్రహీంపట్నం, గుంటుపల్లి గొల్లపూడి మీదుగా వెళుతుంది. దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయం సమీపంలో కృష్ణానదిలో కలుస్తుంది. కాకపోతే ఇక్కడ సమస్య ఏమిటంటే కృష్ణా నదిలో ప్రవాహం తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. దీంతో ఆ నదిలో కలవాల్సి న వాగు ప్రవాహం వెనక్కు వస్తోంది. దాంతో ఆ ప్రవాహమంతా గొల్లపూడి దగ్గర భవానీపురం మీదుగా వెళ్లాల్సి వస్తోంది. దీనివల్లే అటు అజిత్‌సింగ్‌నగర్, ఆటోనగర్ వరదలో చిక్కుకున్నాయి. వరద వల్ల సింగ్‌నగర్, నున్న, గన్నవరం ఈ ప్రాంతాలకు వెళ్లడానికి మార్గం లేకుండా పోయింది. దీనివల్ల ఇక్కడ వరద ముంచెత్తింది. అందుకే అనేక అపార్టమెంట్‌లు, ఇళ్లపై వరద ప్రభావం అధికంగా పడింది. జనజీవనం కూడా స్తంభించింది. విజయవాడలో చాలా ప్రాంతాలు వరద గుప్పిట్లో చిక్కుకుపోవడానికి ప్రవాహానికి మార్గం లేకపోయింది. బుడమేరు వాగును కారణంగా చెబుతున్నారు నిపుణులు. బుడమేరులో మూడొంతుల భాగం ఆక్రమణకు గురి కావడంతో నీటి ప్రవాహానికి మార్గం లేకపోయింది. బుడమేరును ఆక్రమించి పక్క భవనాల నిర్మాణంతోనే వరద ఉధృతి పెరిగి మూడు చోట్ల గండి పడి వేల గృహాలను ముంచెత్తింది. ఆక్రమణలతో బుడమేరు కుంచించుకుపోయింది. కొల్లేరులో ఆక్రమణల వల్ల బుడమేరు వరదనీరు కొల్లేరులో కలిసే మార్గం లేక వెనక్కి వచ్చేశాయి. ఆపరేషన కొల్లేరు ఆగిపోవడం కూడా బుడమేరుకు శాపంగా మారింది. ఇటువంటి ఆక్రమణలే విజయవాడ ముంపునకు కారణం అని నిపుణులు చెబుతున్నారు. 2005ల చేపట్టి బుడమేరు డైవర్షన్ పనులు ఆ తర్వాత అటకెక్కాయి. బుడమేరు విజయవాడ పట్టణంలోకి రాకుండా నిర్మించిన కరకట్టను ధ్వంసం చేస్తూ నిర్మాణాలు కొనసాగించి కొందరు పర్యావరణానికి తీవ్రమైన హాని చేస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రా విడిపోవడంతో విజయవాడ నగరంలో కొత్త కొత్త కాలనీలు ఏర్పడ్డాయి. ఈ 20 యేళ్లలో జరిగిన నిర్మాణాల మూలంగా కనీసం బుడమేరు కరకట్ట ఆనవాళ్లు కూడా లేకుండా చేశారు. 20 యేళ్ల నిర్లక్ష్యానికి విజయవాడ వాసులు మూల్యం చెల్లించుకోవలసి వచ్చింది.

నిర్లక్ష్యానికి ఫలితంగా తాజా వరదల మూలంగా విజయవాడ మరోసారి నీట మునిగింది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం కళ్లు తెరవాలి. ఆపరేషన్ కొల్లేరు పనులు పూర్తి చేయాలి. అప్పుడు కానీ బుడమేరుకు వరద ముంపు నుంచి బయటపడే పరిస్థితి లేదని నిపుణులు చెబుతున్నారు. అటు కొల్లేరు ఆక్రమణలను, ఇటు బుడమేరు ఆక్రమణలను పూర్తిగా తొలగించవలసిన అవసరం ఉంది. వరదలతో ప్రజల అతలాకుతలమవుతుంటే వాళ్ల కష్టాలకు పరిష్కార మార్గం కనుగొనవలసిన రాజకీయ నాయకులు తమ స్థాయిని మరచి మీ వల్లే వరదలు వచ్చాయంటే మీ వల్లే అని ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటూ ఎవరు నిజం చెబుతున్నారో? ఎవరు అబద్ధం చెబుతున్నారో తెలియక ప్రజలు అయోమయంలో పడిపోయారు. ఏది ఏమైనా మానవ తప్పిదాలే ఈ వరదలకు కారణమనేది నూటికి నూరు శాతం నిజం. ఇప్పటికైనా మేల్కొని స్వార్థ ప్రయోజనాలను వీడి పర్యావరణానికి హాని చేయకుండా దాన్ని పరిరక్షించుకునే కార్యక్రమాలను చేపడితే మున్ముందు రాబోయే పెనుముప్పులను ఎదుర్కోవడానికి అవకాశం ఉంటుంది.

---

కొందరు యువకులు ద్విచక్రవాహనాలకు సైతం మన వంటకాలను రుచ చూపించి ఆప్యాయత, అనుబంధాలతో ఆనందంగా గడిపేవారు. నేడు పండుగలను ప్రజలు భయపడే రీతిలో కొందరు జరుపుకుంటున్నారు.

**ప్లాస్టిక్ కాలుష్యం:** నేడు ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్యం పెరిగిపోయింది. కొన్ని వేల సంవత్స రాలైన ప్లాస్టిక్ మట్టిలో కలవకుండా కాలుష్యాన్ని పెంచుతుందనే నగ్నసత్యం అందరికీ తెలిసిందే. అయినప్పటికీ ప్లాస్టి క్ వాడకం తగ్గడం లేదు. పెరుగుతున్న ప్లాస్టిక్ ఉపయోగాన్ని తగ్గించడానికి చైనా ప్లాస్టిక్ ఉత్పత్తులపై నియంత్రణ చేపట్టింది. కెనడాలో ఏకంగా ఎమర్జెన్సీ విధించాల్సి న పరిస్థితి ఏర్పడింది. ఫ్రాన్స్‌లో 2016లో ప్లాస్టిక్ నియంత్రణ చట్టాన్ని చేశారు. ఈ చట్టం ప్రకారం సాధారణ అవసరాలకు వినియోగించే ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పులు ఇత్యాది వాటిపై 2020వరకు పూర్తిగా నిషేధం విధించారు. ప్లాస్టిక్‌పై నిషేధం విధించకుండానే ప్లాస్టిక్ వాడకా న్ని తగ్గించగలిగిన దేశం ఐర్లాండ్. భారీగా జరిమానాల మూలంగా ఆ దేశంలో ప్లాస్టిక్ వినియోగం 94శాతం తగ్గిపో యింది. మలేషియా కూడా ప్లాస్టిక్ నియంత్రించడంలో విజయం సాధించింది.

**ముంచెత్తుతున్న వరదలు**

జీవుల మనుగడకు అవసరమైన ప్రతి వస్తువు సమకూరుస్తూ రుణం తీర్చుకోలేనంతగా మేలు చేస్తోంది ప్రకృతి. కానీ మనిషి ఆ మేలును మరచి ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తూ, కలుషితం చేస్తూ, ప్రకృతిలోని సమతౌల్యాన్ని దెబ్బ తీస్తున్నాడు. ఎడాపెడా కాలుష్యాన్ని వదులుతూ భూతాపాన్ని పెంచడం, చెట్ల నరికివేత, కొండలు, గనులను ఎడాపెడా తవ్వడం, జలవనరుల విధ్వంసం, ముందుచూపు లోపించిన పట్టణ ప్రణాళిక ఒకటేమిటి.. ప్రకృతికి మనిషి చేస్తున్న నష్టాల జాబితా గురించి చెబితే అది మహా గ్రంథమే అవుతుంది. తనకు ఇంత నష్టం చేస్తే ప్రకృతి ఎలా ఊరుకుంటుంది? వరదలు, భూకంపాలు, సునామీలు, అతివృష్టి, అనావృష్టి.. ఇలా ఏదో ఒక విపత్తు రూపంలో విరుచుకుపడుతుంది. తనకు ఎదురు వస్తే ఏం జరుగుతుంది? అనే విషయాన్ని విపత్తుల రూపంలో చాటి చెబుతుంది. ఇప్పటికైనా గుణపాఠాలు నేర్చుకుని, తనను కాపాడి మిమ్మల్ని మీరు కాపాడుకోండని ప్రకృతి మనుషులకు పదే పదే గుర్తు చేస్తుంది.

అయినా మనిషి మారడం లేదు. తన శాయశక్తులా ప్రకృతిని సర్వనాశనం చేస్తూనే ఉన్నాడు. జలవనరులను ఇష్టానుసారంగా ధ్వంసం చేసి ఫలితాన్ని అనుభవిస్తున్నాడు. విజయవాడ, ఖమ్మం వరదల రూపంలో ఇటీవల ఆ ఫలితం కళ్లముందు ప్రత్యక్షంగా కనిపిస్తోంది.



విజయవాడ, ఖమ్మం వరదలే కాదు, గత కొన్ని సంవత్సరాల్లో సంభవించిన పలు విపత్తులు మనిషి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరాన్ని చాటి చెబుతున్నాయి. ఒకసారి నష్టం రిగితే రెండోసారి అది పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. పదే పదే నష్టం జరుగుతున్నా సరిదిద్దుకోకుంటే దాన్నే నిర్లక్ష్యం అంటారు. ఆ నిర్లక్ష్యానికి ప్రత్యక్ష ఉదాహరణలు తెలుగు రాష్ట్రాల్లోని విజయవాడ, ఖమ్మం విలయాలు. ములుగు జిల్లాలో అభయారణ్యం నేలమట్టం అయింది. కొద్ది రోజులు మండుటెండలు మాడి మసి చేస్తే, కొన్ని రోజులు కుండపోత వర్షాలతో వరదలతో మానవ జీవితం అతలాకుతలమైంది. 2013 ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ వరదలు, 2020 హైదరాబాద్ వరదలు, ఇటీవల కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన సంఘటనలు ఇలాంటివే. తుపాన్లు, అల్పపీడన ప్రభావాలతో భారీ వర్షాలు కురవడం సాధారణ విషయమే అయినప్పటికీ ఇటీవల కాలంలో వాటి తీవ్రత బాగా పెరిగింది. ఉన్నట్లుండి వాతావరణం మారిపోయి గంట వ్యవధిలోనే సెంటీమీటర్లకొద్ది వర్షం కురవడం, ఉదయం మండిపోయే ఎండలు, సాయంత్రం కుండపోతవాన.. ఇలాంటి సంఘటనలు ఈ మధ్య సాధారణ విషయాలుగా మారిపోయాయి. ఇకముందు ఇలా జరగకుండా ఉండాలంటే దీనికి ప్రధాన కారణమైన భూతాపాన్ని తగ్గించడం మొట్టమొదటి మార్గం. పెరుగుతున్న కాలుష్యమే భూతాపానికి ముఖ్య కారణం. అందువల్ల కాలుష్యాన్ని తగ్గించే మార్గాలను అనుసరించాలి. బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్ప కాకుండా సౌర, పవన విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని ప్రోత్సహించాలి. అడవులు, చెట్ల నరికివేతను నిలిపివేసి పచ్చదనాన్ని పెంచాలి. భూతాపాన్ని తగ్గించి ప్రకృతిలో సమతౌల్యం లోపించకుండా, అది విపత్తుల రూపంలో విరుచుకుపడకుండా చేయడంలో ఈ చర్యలు అత్యంత కీలకం. వరదలు, విపత్తుల నివారణలో జలవనరుల సంరక్షణ మరో కీలక చర్య. మనం చెరువులోకి వెళితే, చెరువు మన ఇంటికి వస్తుంది. దశాబ్దం క్రితంనాటి ఉత్తరాఖండ్ వరదలైనా, ఇప్పటి విజయవాడ, ఖమ్మం వరదలైనా ఇదే పాఠాన్ని బోధిస్తున్నాయి. గత కొన్ని సంవత్సరాల్లో ఉత్తరాఖండ్‌లో గంగానది తీరం వెంట సహజసిద్ధంగా ప్రవహించే మార్గాలను ఆక్రమించి ఎడాపెడా నిర్మాణాలు, కొండల ధ్వంసం, సొరంగాల తవ్వకం, ఆనకట్టలు, విద్యుత్ కేంద్రాలు వంటి భారీ నిర్మాణాలు చేపట్టారు. ఫలితంగా గంగానది ప్రవాహం సహజంగా ముందుకు వెళ్లే మార్గాలు లేక నివాస ప్రాంతాలను ముంచెత్తింది. భారీ నిర్మాణాల వల్ల కేదార్‌నాథ్ పర్వతాల్లో సహజత్వం లోపించి కొండచరియలు విరిగిపడ్డాయి. ఫలితంగా 5 వేల 7 వందల మంది ప్రాణాలను కోల్పోవాల్సి వచ్చింది. విజయవాడ మునగడానికి ప్రధాన కారణమైన బుడమేరు, ఖమ్మం వరదలకు కారణమైన మున్నేరు వాగుల పరిస్థితి కూడా ఇలాంటిదే. ఈ రెండు వాగులు ఎక్కడికక్కడ ఆక్రమణలకు గురయ్యాయి. వీటి వెంట పెద్ద ఎత్తున నిర్మాణాలు వెలిసాయి. ఫలితంగా వాటి సహజసిద్ధ ప్రవాహ మార్గాలు కుంచించుకుపోయాయి. అందుకే భారీ వర్షాలు కురవడంతో బుడమేరు, మున్నేరు వాగుల్లో నీరు ముందుకు వెళ్లే మార్గం లేక ఊళ్ల మీద విరుచుకుపడ్డాయి. అందువల్ల సహజ వనరులను కాపాడుకునే విషయంలో ఇది నేర్చుకోవాల్సిన మరో పాఠం.

## పర్యావరణ పరిరక్షణ చట్టాలు

పర్యావరణాన్ని రక్షించి, జీవరాశిని కాపాడటానికి సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కొన్ని చట్టాలను చేసింది. పర్యావరణాన్ని పరిరక్షించే విషయంలో ప్రభుత్వం, ప్రజల బాధ్యత వహించాలని రాజ్యాంగం నిర్దేశించింది. మొదట రాజ్యాంగంలో ఈ ప్రస్తావన లేదు. కానీ 1972 జూన్‌లో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో స్టాక్‌హోం (స్వీడన్)లో నిర్వహించిన పర్యావరణ సదస్సులో దీన్ని సవరించారు. 1976లో 42 రాజ్యాంగ సవరణ ద్వారా 48(ఏ), 51(ఏ), నిబంధనల కింద పర్యావరణ పరిరక్షణను పొందుపరిచారు.

**కర్మాగారాల చట్టం(1948)**

1887 చట్టాన్ని సవరించి కార్మాగారాల్లో పనిచేసే కార్మికుల ఆరోగ్య, భద్రత, సంక్షేమం కోసం 1948లో కర్మాగారాల చట్టాన్ని రూపొందించింది. పరిశ్రమల చుట్టుపక్కల నివసించే ప్రజల ఆరోగ్య, భద్రత, పర్యావరణం గురించి ఈ చట్టంలో నిబంధనలను రూపొందించారు.

**క్రిమిసంహారక మందుల చట్టం(1968)** క్రిమి సంహారక మందుల తయారీ, రవాణా, విక్రయం, వినియోగం, దిగుమతి ఇత్యాది కార్యకలాపాలను క్రిమిసంహారక మందుల చట్టం 1968 ద్వారా నియంత్రించవచ్చు. పర్యావరణ మార్పులను 1994లో రూపొందించిన ఈఐఏ(ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్-ఈఐఏ) విధానం ద్వారా బేరీజు వేసుకుని, చెడు ప్రభావాల ఉధృతిని తగ్గించి, పర్యావరణ సమతౌల్యతకు,



జీవ నాన్యత విలువలు పెంచడానికి ప్రత్యామ్నాయ మార్గాలు రూపొందించడానికి వీలవుతుంది. పర్యావరణ ప్రతికూల పరిస్థితుల తీవ్రతను తగ్గించడానికి ముందుగానే అనుకూల మార్గాలు ఏర్పాటు చేసుకోవచ్చు. అమెరికా 1970లోనే జాతీయ పర్యావరణ విధానాన్ని చట్టబద్ధం చేసి తొలిసారిగా అమలు చేసింది. ఈ విధానం ఇప్పుడు ప్రపంచానికే మార్గదర్శిగా మారింది.

**అటవీ పరిరక్షణ చట్టం(1980)**

అడవుల్లో నివసించే గిరిజనులు కలపను పొందే హక్కును హరిస్తూ, పోడు వ్యవసాయ విధానాలను కట్టడి చేస్తూ, అటవీ ఉత్పత్తులను సేకరించుకోవడాన్ని నిషేధిస్తూ, బ్రిటిష్ ప్రభుత్వం 1927లో అటవీ పరిరక్షణ చట్టాని చేసింది. దీన్ని సంస్కరణలు చేస్త 1980లో భారత ప్రభుత్వం అటవీ పరిరక్షణ చట్టన్ని తీసుకొచ్చింది. 1988లో మరోసారి ఈ చట్టాన్ని సవరించారు. దీని ప్రకారం గనుల తవ్వకాలు చేపట్టకూడదు.

**వాయు కాలుష్య నివారణ, నియంత్రణ చట్టం(1981)**

వాహనాల నుండి వెలువడే పలురకాల ఉద్గారాలు, పారిశ్రామిక విసర్జితాలను నియంత్రించడానికి 1981లో కేంద్ర ప్రభుత్వం వాయు కాలుష్య నియంత్రణ చట్టాన్ని రూపొందించింది. ఈ నిబంధనలను అతిక్రమించిన వ్యక్తులు, సంస్థలు శిక్షార్హులు. ఈ చట్టాన్ని అతిక్రమించిన వారికి ఏడాదిన్నర నుండి గరిష్టంగా 6 సంవత్సరాల వరకు జైలుశిక్ష, పదివేల జరిమానా విధిస్తున్నారు. ఈ చట్టాన్ని అనుసరించి శబ్ద కాలుష్యాన్ని కూడా వాయు కాలుష్యంలో భాగంగా పేర్కొన్నారు.

ఎకో మార్క్(1991): దీన్ని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ సంస్థ ఏర్పాటు చేసింది. పర్యావరణానికి హాని కలిగించని ఉత్పత్తులకు ఎకో మార్క్ సర్టిఫికెట్‌ను ఈ సంస్థ జారీ చేస్తుంది. పర్యావరణంపై చెడు ప్రభావం చూపించే ఉత్పత్తులకు అనుమతులు ఇవ్వదు.

**జల కాలుష్య నియంత్రణ చట్టం (1974):**

దీని ప్రకారం నీటి స్వచ్ఛతను మెరుగుపరచడం కోసం కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో కాలుష్య నియంత్రణ బోర్డులను ఏర్పాటు చేయవచ్చు. 1988లో సవరణ చేసి మరింత బలోపేతం చేశారు. కాలుష్య నియంత్రణ ప్రమాణాన్ని పాటించని పరిశ్రమలను మూసివేసే అధికారం ఈ చట్టం ద్వారా లభించింది.

**పర్యావరణ సంరక్షణ చట్టం(1986)**

1974లో రూపొందించిన జల కాలుష్య నియంత్రణ చట్టం, 1961లో వాయు కాలుష్య నియంత్రణ చట్టం రెండూ





సమర్థంగా పర్యావరణ కాలుష్య నివారణ ఉపయోగపడలేదని కేంద్ర ప్రభుత్వం గ్రహించింది. ఆ కారణంగా అన్ని రకాల కాలుష్యాల పర్యావరణ నాణ్యత కాపాడటం కోసం కేంద్ర పార్లమెంటు ద్వారా 1986లో ఒక సమగ్ర, సార్వత్రిక చట్టాన్ని ప్రవేశపెట్టింది. దీన్ని పర్యావరణ పరిరక్షణ చట్టం అంటారు.

**జాతీయ పర్యావరణ ట్రిబ్యునల్ చట్టం(1995)**

వాణిజ్య, ఆర్థిక కార్యలాపాలు జరిపేటప్పుడు వ్యక్తులతో పాటు వారి ఆస్తులకు, పర్యావరణానికి నష్టం వాటిల్లితే తగిన పరిహారం ఇప్పించేందుకు ఈ చట్టాన్ని అమల్లోకి తెచ్చారు. ఇప్పుడు ప్రపంచ జనాభా పెరిగిపోతోంది. పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరం కంకణబద్ధులం కావాలి. మన పెద్దలు మనకు అందించిన స్వచ్ఛమైన పర్యావరణాన్ని, యథావిధంగా మన ముందు తరాలకు అందించేందుకు ప్రతిన బూనాల్సిన అవసరం ఉంది. ప్రతి మనిషి పర్యావరణాన్ని అమ్మలాగే చూసుకోవాలి. పునరుత్పాదక ఇంధనం, గ్రీన్ బిల్డింగ కాన్సెప్ట, క్లీన్ టెక్నాలజీస్, ఎలక్ట్రిక్ వాహనాల వైపు వెళ్లాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత పరిస్థితి ఇలానే కొనసాగితే భూతాపం మరింత పెరిగి ముమ్ముందు భూమి మీద మానవుడు బతికే పరిస్థితి ఉండబోదని పరిశోధనలు నొక్కి చెబుతున్నాయి. మనం భావితరాలకు ఎలాంటి భూమిని అందించబోతున్నాం అనే విషయాన్ని సమీక్షించుకోవాలి. సముద్రం మట్టం పెరుగుతుంది. ఋతువులు మారుతున్నాయి. ప్రకృతి హెచరిస్తుంది. అర్థం చేసుకొని ప్రకృతికి అనుకూలంగా జీవనం అలవాటు చేసుకోవలసిన ఆవశ్యకత ఉంది. ఆధునిక నాగరికత, పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం పేరుతో విచ్చలవిడిగా వనరుల దుర్వినియోగం కారణంగా సహజ పర్యావరణం రోజురోజుకూ క్షీణిస్తోంది.

నాగరికత విస్తరిస్తుందని గొప్పలు చెప్పుకుంటున్న అనేక దేశాల్లో నీరు, గాలి నాణ్యత కోల్పోతున్నాయి. వీటన్నింటిని మరచి నా మతం, నా కులం, నా జాతి, మా రాజకీయ పార్టీ, మా నాయకుడు, మా దేశమే గొప్ప అంటూ బీరాలు పలుక్కుంటూ, వ్యక్తిగత స్వార్థం కోసం నిత్యం ప్రజల మధ్య తగవులు పెడుతూ, విభజించి పాలిస్తూ, నిత్యం ఏదో ఒక సమస్యను సృష్టించి రాక్షసానందంతో లబ్ధి పొందుతూ ప్రపంచంలోని అనేక దేశాలు పర్యావరణాన్ని అశ్రద్ధ చేస్తున్నాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నందువల్ల ప్రయోజనం లేదు. ముందుగానే ప్రపంచ దేశాలన్నీ కళ్లు తెరిచి పర్యావరణాన్ని కాపాడుకోవాలి. ప్రకృతి సమతుల్యాన్ని, వన్యప్రాణుల మనుగను కాపాడటంతో పాటు పర్యావరణానికి జరుగుతున్న నష్టాలను సాధ్యమైనంత వరకు నివారించి కాపాడుకోవాలి. లేదంటే భావితరాలు ఈ తరాన్ని ఎన్నటికీ క్షమించవు. ❍

## 'పుడక'తో అందం ఆరోగ్యం

(4వ పేజీ తరువాయి)

ఆడవారికి గర్భకోశవ్యాధులు తగ్గుతాయి. అంతేకాదు కంటి, చెవినరాలు ఆరోగ్యంగా ఉంటాయి. ముక్కు కుట్టించుకోవడం వల్ల చెవిపోటు వంటివి దరిచేరవు. నేడు ముక్కుపుడక అనేది కేవలం ఆచారంగానే కాకుండా ఫ్యాషన్‌గా కూడా మారిపోయింది. వివిధ రకాల మోడల్స్‌లో లభ్యమవుతోన్న ముక్కుపుడకలు మహిళల అందాన్ని రెట్టింపు చేస్తున్నాయి. అంతేకాదు ఇవి అతితక్కువ ధరల్లో అందుబాటులో ఉంటున్నాయి.

దేవతలందరికీ ముక్కెర తప్పకుండా ఉంటుంది. బెజవాడ కృష్ణానది పొంగి కనకదుర్గమ్మ ముక్కెరను తాకితే భూమి మీద ఎవ్వరూ మిగలరని పోతులరి వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞానంలో చెప్పారు. త్రిపురాజుల రాణులు బంగారు ముక్కు ఉంగరాలు ధరించేవారు. కుటుంబానికి చెందిన వధువు ధరించే ముక్కు పుడకశ్రేయస్సును సూచిస్తుందని కొందరు నమ్ముతారు. ఎంత ధనవంతులు అయితే తమ కుటుంబ సభ్యుల ముక్కుపుడకలు అంత పెద్దవిగా ఉంటాయంట. కుటుంబంలో లాభం ఉన్నప్పుడు, వ్యాపారాలు లాభాల్లో ఉన్నప్పుడు స్త్రీల ముక్కుపుడకల బరువు పెరుగుతుంది. కానీ నేడు అంతబరువైనవి పెట్టుకోడానికి మహిళలు ఇష్టపడటం లేదు. అందుకే, ప్రత్యేక సందర్భాలలో మాత్రమే పెద్ద ముక్కుపుడకలను ధరిస్తారు. వివాహానికి సంకేతంగా భావించే ముక్కుపుడక వివిధ రకాల డిజైన్లలో అందుబాటులో ఉన్నాయి. అయితే ఈ ఆచారంఎప్పుడు మొదలైందన్న ఖచ్చితమైన ఆధారాలు లేవు. కానీ అక్బర్‌కాలంలో ఇది వాడుకలోకి వచ్చిందని కొన్ని పుస్తకాల్లోని కథనాలు ఉన్నాయి. ఉత్తరాఖండ్‌లోని త్రిపుర జిల్లాలోని రాణులు మొదట ముక్కుపుడక ధరించారని చరిత్ర చెబుతోంది. ❑





## ఇంటిని మెరిపించే ఇటుకలు

రోజంతా ఎక్కడెక్కడో తిరిగొచ్చినా..ఆ శ్రమని మరిపించే చల్లని లోగిలి ఇల్లే. అలాంటి ఇల్లు అందంగా ఉండాలని కోరుకుంటాం కదా. ఈ గ్లాస్ బ్రిక్స్ మీ కోరికను తీర్చడంతోపాటు మరిన్ని ప్రయోజనాలూ అందిస్తాయి. ఇల్లు కట్టాలంటే..ఇటుకలు, సిమెంట్ తప్పని సరి అనుకుంటాం. కానీ వాటి అవసరాన్ని చాలామటుకు తగ్గిస్తున్నాయి ఈ గ్లాస్ బ్రిక్స్. వీటిని జిగురుతో కావాల్సిన విధంగా, చకచకా అతికించు కుంటూ వెళ్లిపోతే చాలు. సరికొత్త రంగుల్లో కనిపిస్తూ, ఇంటికి కొత్త అందాన్ని తీసుకొస్తాయి. సోడా యాష్, సిలికాతో తయారయ్యే ఈ ఇటుకలు సాధారణ ఇటుకలతో పోలిస్తే తేలిగ్గానూ ఉంటాయి, నిర్మాణ సమయాన్నీ వ్యయాన్నీ కూడా తగ్గిస్తాయి.

### వేడి రాదు వెలుతురే

నగరాల్లో అన్ని సదుపాయాలతో మనం కోరుకున్నట్టుగా ఇల్లు నిర్మించుకోవడం అంటే మామూలు విషయం కాదు. కోరుకున్న ధరలో డబుల్‌బెడ్ రూమ్ దొరకడమే గొప్ప. ఇక గాలీ, వెలుతురూ ధారాళంగా రావాలి అనుకుంటే నిరాశ తప్పదు. మధ్యతరగతి జీవులకి ఈ గ్లాస్ బ్రిక్స్ వరమనే చెప్పాలి. ఎందుకంటే ఈ ఇటుకలు సాధారణ వాటిల్లా సహజ వెలుతుర్ని పూర్తిగా అడ్డుకోవు. ఫిల్టర్స్ మాదిరిగా పనిచేసి, వేడిని అడ్డుకుంటూ వెలుతురుని మాత్రం ధారాళంగా అందిస్తాయి. దీంతో విద్యుత్తు ఖర్చు బాగా ఆదా అవుతుంది. ఇవి రెండు నుంచి మూడు అంగుళాల మందంతో మాత్రమే ఉంటాయి. పెద్దగా స్థలాన్నీ ఆక్రమించుకోవు. గాజు అద్దాల్లా పూర్తి పారదర్శకంగా ఉండవు. అవతలివైపు దృశ్యాలు స్పష్టంగా కనిపించవు. అలాగే శబ్దాల్నీ అడ్డుకుంటాయి. దాంతో పార్టిషన్లుగా వాడుకోవడానికి అనువుగా ఉంటాయి. ఏకాంతమూ దొరుకుతుంది. ఈ బ్లాక్స్‌ని తయారీదారులు వివిధ ఆకృతుల్లో, కస్టమైజ్డ్ పద్ధతుల్లో తయారు చేస్తున్నారు. దాంతో నిర్మాణాలని మనకు కావాల్సిన విధంగా తీర్చిదిద్దుకోవడం సులభం. ఇన్ని ప్రయోజనాలు ఉన్నాయి కాబట్టే ఈ గ్లాస్ బ్రిక్స్ ఆర్కిటెక్ట్‌లకు ప్రియమైన మెటీరియల్‌గా మారిపోయింది. సాధారణ ఎర్ర



ఇటుకలతోపాటు వీటినీ ఉపయోగిస్తూ అనేక ప్రయోగాలు చేస్తున్నారు. కారిడార్లూ, వంటిళ్లు, ప్రహరీగోడలు ఈ రంగు ఇటుకలతో మెరిసిపోతున్నాయి. గార్డెన్ ఉన్నవారు ఈ రంగుల బ్రిక్స్‌తో తోటని కావాల్సిన విధంగా అందంగా అలంకరించుకోవచ్చు. గార్డెన్ టేబుల్‌నీ తయారు చేసుకోవచ్చు. సోలార్ లైట్లని జోడించి తోట దారిని మనోహరంగా మార్చేయొచ్చు. ❑






# ఒక బాణం-ఒక గానం

గాల్లోకి నేనొక బాణం సంధించాను
అది భూమి మీద పడింది, కానీ ఎక్కడో తెలియదు
అది ఎంత వేగంగా దూసుకుపోయిందంటే
నా చూపు దాన్ని అందుకోలేకపోయింది.

నేను గొంతెత్తి గాల్లో ఒక పాట పాడాను
అది కూడా భూమి మీదే పడింది, కానీ
ఎక్కడో తెలియదు.
అయినా గానాన్ని అనుసరించగల
సున్నితమైన చూపు
ఎవరికుంటుందనీ?
చాలా కాలం గడిచిపోయ్యాక మళ్లీ
అటు వెళ్లాను
చెట్ల గుబురులో బాణం ఉంది-విరగకుండా!
అలాగే నా పాట వినిపించింది పొల్లుపోకుండా
మొదటి నుండీ చివరిదాకా-స్నేహితుడి మదిలో.

**మూలం : హెచ్.డబ్లూ.లాంగ్‌ఫెలో**
**తెలుగు : డాక్టర్ దేవరాజు మహారాజు**

# పయనం..



పిల్లల్ని గూడులో పెట్టి
పక్షులు ఆకాశంలో
సుదూర ప్రాంతాలకు
ఆహారం కోసం పయనం.

కొట్టంలో పలుపులు
విప్పగానే పశువులు
బీడు భూముల్లోకి
మేతకు పయనం.

వలలు పట్టుకుని
పొట్టకూటికోసం
జాలర్లు తెప్పలపై
సాగరంలోకి పయనం.

లాంగ్ బెల్ కొట్టగానే
విద్యార్థులందరూ
ఆకలి కడుపులతో
ఇంటికి పరుగు పయనం.

కాలేజీ విద్యార్థులు
బుక్ షాపులకు బదులు
మొబైల్ షాపులకు
టచ్ ఫోన్ల కోసం పయనం.

**- పేరూరు బాలసుబ్రమణ్యం**

**ఈవారం కవిత్వం**

# నారింజరంగు సాయంత్రాలు

అస్తమిస్తున్న సూర్యున్ని
నుదుట కౌగిలించుకొని
ఆమె వాకిట్లోకొచ్చింది
భూమికి నారింజరంగు చల్లినట్లుంది
అరచేతిలో ఆ సాయంత్రాన్ని పట్టుకొని
తడిమట్టిపై సంధ్యవనంలోకి మరలి
బంగారు చారల ఆకాశం కింద
అతని వెనకాలే నిల్చుంది!
అతని కళ్లల్లో సముద్రం కదిలింది
ఇద్దరూ శబ్దాలకతీతమైన పడవపై
మసక వెన్నెలను తాగుతూ
ఆ కిటికీలోంచి ఆవలకు కనుమరుగైపోయింది
ఆమె గుప్పిట్లోంచి వదలబడిన సాయంత్రం
నీటిపై కాంతిపురుగుల వారధైంది..
సిల్హౌట్‌లో ఒక తైలవర్ణం చిత్రం రాలిపడింది.

**- రఘు వగ్గు**



# పుస్తక సమీక్ష




## సమాజాన్ని ప్రశ్నించే కథలు

సమకాలీన సాహితీవేత్తల్లో సింహప్రసాద్ (చెలంకూరి వరహ నరసింహప్రసాద్) అగ్రస్థానం. 50ఏళ్ల సాహితీ ప్రస్థానంలో 520 కథలు, 72 నవలలు మరెన్నో వ్యాసాలు రాసారు. వీరి వివాహవేదం, తిరుమల దివ్యక్షేత్రం, నాలుగు తరాలు నిలిచే రచనలు. వీరి కథలు, నవలలు సమకాలీన సమాజాన్ని ప్రతిబింబిస్తాయి. సమస్యల్ని చర్చకు పెడతాయి. తమవైన తీర్పుల్ని ఇస్తాయి. పలు పురస్కారాలు అందుకోవడమే కాదు, వేదగిరి రాంబాబు పేరిట ఏటా యువకథకులకు బాలసాహితీవేత్తలకు పురస్కారాలు అందజేస్తున్నారు. ప్రస్తుత కథాసంపుటి 'బతకాలి'లో 18 కథలున్నాయి. పైకి ఒకోలా కనిపించే వ్యక్తుల ఆంతర్యాలు మరోలా ఉంటాయి అని చెప్పారు 'గోడలు' కథలో. గోడలు కూలితే, ఆ ముసుగులు తొలగిపోతే, ఆ నగ్నత్వాన్ని భరించలేం అని నిరూపించారు రచయిత. పౌరులు రాజ్యాన్ని నిర్మిస్తారు. భారత్ శ్రీలంకల మధ్య ఉన్న 'కచ్చతీవు' పరిసరాల్లో భారత్ జాలర్ల చేపల వేటను శ్రీలంక నిషేధించింది. అయినా సెల్వరాజ్‌లాంటి చిన్న జాలరి బతకాలంటే అక్కడ చేపల వేట తప్పదు. అంటే, శ్రీలంకా నావికదళంతో పోరాడాల్సిందే అంటారు. 'జీనేకేలియే జహర్‌భీఖానాహిపడేగా' (బ్రతకాలంటే, నిషాన్నైనా ఖాద్యం చేసుకోవాల్సిందే) అని ఆనాడే అన్నాడోకవి. అన్నీ మంచి కథలే! జీవనయానంలోని లొసుగుల్ని చర్చకు పెట్టేవే! రచయితకు అభినందనలు. **(బతకాలి, రచన: సింహప్రసాద్, వెల: రూ 150, ప్రతులకు: పాలపిట్ట, ఇతర ప్రముఖపుస్తకశాలలు)**

– కూర చిదంబరం

## గిలిగింతలు పెట్టే ముళ్లపూడి కథలు



అక్షజ్ఞ పబ్లికేషన్స్ ప్రచురించిన ముళ్ళపూడి వెంకట రమణ హాస్య కథల పుస్తకాల జాబితాలో ఐదో హాస్య కథల పుస్తకం 'రాజకీయ భేతాళ పంచ వింశతిక' మొత్తం పాతిక కథలున్నాయి. హాస్యం ప్లస్ వ్యంగ్యం అంటే ముళ్ళపూడీయం. కడుపుబ్బా నవ్వుకోవాలనుకుంటే ఈ పుస్తకం చేతిలోకి తీసుకోండి. ముఖచిత్రంతో సహా కథలన్నింటినీ బాపు కుంచెతో అలంకరించారు. లేదూ అలరించారు. యిందులోని కథలన్నింటిలో రెండు ముఖ్యపాత్రలు..ఒకటి రామిరెడ్డి మరోటి సుబ్బరాజు. రామిరెడ్డి కథ చెప్తుంటే సుబ్బరాజు వింటుంటాడు. లేదు సుబ్బరాజు చెప్తుంటే రామిరెడ్డి వింటుంటాడు. వీళ్ళిద్దరూ వినిపిస్తున్న కథల్లో రాజకీయ నాయకులు విజృంభిస్తుంటారు. ఓటర్లు చిత్తవుతుంటారు. మధ్యమధ్య కార్యకర్తలు నలిగిపోతుంటారు. పంచాయితీ ఎన్నికల నుండి పార్లమెంటు ఎన్నికల వరకు జరిగే ప్రహసనాలు పలకరిస్తుంటాయి. ఓటర్ల ఓటాట్ల తమాషాగా వుంటుంది. ఒకసారి గెలిచిన వాడు తిరిగి ఓడిపోతుంటాడు. ఓడిపోవాల్సినవాడు తమాషాగా గెలుస్తుంటాడు. ఈ గెలుపోటముల మధ్య కావలసినంత సంబరంతో ఓటర్లు గంతులేస్తుంటారు. అప్పుడప్పుడు భంగపడుతుంటారు. కథలన్నీ 'హాస్యం హాస్యం పునః హాస్యం'లా గిలిగింతలు పెడ్తాయి. తెగ నవ్విస్తారు. చదవండి..ముళ్ళపూడి మార్కు హాస్యం గ్యారంటీ. **(రాజకీయ బేతాళ పంచవింశతిక, రచన: ముళ్లపూడి వెంకట రమణ, వెల: రూ 195, ప్రతులకు: అక్షజ్ఞ పబ్లికేషన్స్, 12-11-1364, పరసర అపార్ట్‌మెంట్స్, వారాసి గూడ, సికింద్రబాద్)**


– రమణ వెలమకన్ని

## 'నాన్నకు నీరాజనం' కథాసంపుటి



కథా రచయిత్రి తటవర్తి నాగేశ్వరి, స్త్రీ, పురుష బాంధవ్యాలలో ఒడిదుడుకులను సానుకూల దృక్పథంతో ఆలోచించి మానవీయత, నిజాయితీ విలువలు స్ఫురింపచేసే కథలు రచించగలరని ఈ సంపుటి స్పష్టం చేస్తోంది. ఇందులో 21 కథలున్నాయి. వైవిధ్యభరితమైన వినూత్న ఇతివృత్తాలకు ఈ కథలు అద్దం పడుతున్నాయి. ప్రతీకథ ఏదో ఒక మంచి, నైతికత, సంస్కారవంతంగా తీర్చిదిద్దారు. 'ఆషాఢవియోగం'లో ఆధునిక సంప్రదాయ కథనం, 'నాన్నకు నీరాజనం'లో నాన్నను క్షమించిన కుమార్తె, 'మాంద్యం'లో తండ్రిని దోషిగా నిలబెట్టడం, 'హనీ'లో సాంకేతికత ద్వారా ట్రాపింగ్ 'ఏరువాక'లో వ్యవసాయ వృత్తికి అనుకూలత, ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలలో యువత ఎదుర్కొనే సమస్యలకు చాకచక్యంగా సానుకూలంగా పరిష్కారం లభింపచేసారు. సన్నివేశాలు, కథలలోని పాత్రలు చదువరులకు సుపరిచితమై, కదలాడి ఆ పాత్రల మనోభావాలు, ఆలోచించే తీరుతెన్నులు రచయిత్రి కల్పనా చమత్కృతితో ముడిపడి ముగింపు యిస్తాయి. కథను నడిపించడంలో, ఆసాంతం చదివేటట్టు చేయడంలో రచయిత్రి కృతకృత్యత సాధించారు. సర్వసాధారణమైన అంశాలను సృజనాత్మక ప్రతిభతో రచయిత్రి ఈ రెండో కథాసంపుటి వెలువరించడం అభినందనీయం. **(నాన్నకు నీరాజనం, రచన: తటవర్తి నాగేశ్వరి,వెల: రూ 200, ప్రతులకు: నవతెలంగాణ, నవోదయబుక్‌హౌస్‌లు)** – యర్రమిల్లి

## మధ్య తరగతుల ప్రతిబింబం 'అపరాజిత'



పురుషుని చేతిలో మోసపోయిన స్త్రీ సుందరి. నవల ప్రారంభం నుండి చివరిదాకా సుందరిపాత్ర పిల్లలతో సాగుతుంది. సాలమ్మ ఆమె కోడలు నాగమ్మ, ఆమె కూతురు సుందరి, సాలమ్మ కూతురు రాములమ్మ, ఆమె భర్త వీరయ్య వారి కొడుకు భీముడు, భీముడుతో పెళ్లి నిశ్చయం చేసిన సాలమ్మను కోడలు నాగమ్మ ఎదురించినా అత్తకు లొంగి పోతుంది. నాగమ్మ కొడుకు రంగడు అతని స్నేహితుడు ఆనంద్, సుందరిని ప్రేమించి లేవదీసుకు వెళ్లడం ముగ్గురు పిల్లలకు సుందరి తల్లి అవ్వడం దేవాలయంలో రామయ్య తోడ్పాటుతో తలదాచుకోవడం, పూజారి కుటుంబాలు నలుగురు కొడుకులు తర్వాత సరిసి ఆడపిల్ల పుట్టడం ఆమె పెద్దదయ్యాక ఒకరిని ప్రేమించి మోసపోయి రామయ్య వద్దకు వచ్చి ముద్ద పెట్టమని తన కొడుకుతో రావడం.. ఊళ్లో చాలామంది సుందరి, రామయ్యలకు అక్రమ సంబంధం అంటగట్టడం, రామయ్య ఆమెను ఆదరించి అగ్నెస్ (అన్నమ్మా) ఆశ్రమం చేర్చడం ఈ నవల ప్రధాన కథాంశం. హిందూ దేవాలయం నుండి అగ్నెస్ ఆశ్రమం వైపు రామయ్యతో పిల్లలతో సుందరి చేరడంతో నవల ఆరంభం అవుతుంది. చిరంజీవి, శ్రీదేవి, దీప పాత్రలతో 'సుందరమ్మ' అనుబంధం పాఠకుల్ని ఆర్తితో నింపుతుంది. **(అపరాజిత, రచన: గిరిజా హరికరణం, వెల: రూ 160, ప్రతులకు: 7-1-26/బిటి/ 304, భాను డీలక్స్ టవర్స్, లీలా నగర్, అమీర్‌పేట, హైదరాబాద్)** – తంగిరాల చక్రవర్తి



# ఆందోళనలో అంతరిక్ష పరిశోధనలు!

నాసా ప్రయోగించిన 'బోయింగ్ స్టార్‌లైనర్' వ్యోమనౌకలో ఎనిమిది రోజుల అంతరిక్ష పరిశోధనల పర్యటనకు సునీతా విలియమ్‌తో పాటు బుచ్ విల్మోర్ వ్యోమగాములు జూన్ ఐదు, 2024న ఫ్లోరిడా 'స్పేస్‌ఫోర్స్ స్టేషన్' నుండి బయలుదేరి జూన్ 6, 2024న 'అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఇంటర్నేషనల్ స్పేస్‌స్టేషన్, ఐఎస్ఎస్' చేరుకొని ప్రయోగాలు చేయడం ప్రారంభించారు. ఎనిమిది రోజుల తర్వాత భూమికి తిరిగి రావలసిన అంతరిక్ష వ్యోమనౌక సాంకేతిక సమస్యల కారణంగా అక్కడే నిలిచిపోయి, దాదాపు వంద రోజులకు పైగా అక్కడే ఉండిపోవలసి రావడం, వారు భూమికి తిరిగి వచ్చే తేదీలు నిరవధికంగా వాయిదా వేయబడడం తీవ్రంగా కలవరపెడుతున్నది. బోయింగ్ స్టార్‌లైనర్ ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యల్లో హీలియం వాయువు లీక్ కావడం, స్టార్‌లైనర్ థ్రస్టర్ వైఫల్యాలు, ప్రొపల్షన్ వ్యవస్థ పనితీరు నాసా శాస్త్రజ్ఞులకు సవాళ్లుగా నిలుస్తున్నది. అన్ని సాంకేతిక సమస్యలను సమర్థవంతంగా అధిగమించి త్వరలోనే ఇద్దరు వ్యోమగాములు సురక్షితంగా భుమికి తిరిగి రావాలని ప్రపంచ మానవాళి ఎదురు చూస్తున్నది. భూమి నుంచి 370-460 కిమీ దూరంలో ఉన్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్ర కక్ష్యలో చేరి 8 రోజులు అంతరిక్ష పరిశోధనలు చేసి తిరిగి భూమికి రావలసి ఉండగా సాంకేతిక సమస్యలు ఉత్పన్నం కావడంతో వారి రాక నిరవధికంగా పొడిగించబడడం విచారకరంగా తోస్తున్నది.



డా॥బుర్ర మధుసూదన్‌రెడ్డి

### వంద రోజులు దాటిన వైనం

వ్యోమగాములను అంతర్జాతీయ అంతరిక్ష స్టేషన్‌కు తీసుకెళ్లడానికి ప్రైవేట్ క్రూప్రోగ్రామ్‌లో భాగంగా నాసా రెండు ప్రైవేటు వ్యోమనౌకలను ఎంపిక చేసిన విషయం మనకు తెలుసు. ఇప్పటివరకు స్పేస్ ఎక్స్ వ్యోమనౌక ద్వారా 2020 నుంచి నేటివరకు 9జట్ల వ్యోమగాములను ఐఎస్ఎస్‌కు చేర్చగలిగింది. నాసాతో ఒప్పందంతో భాగంగా 6 వ్యోమనౌకల ద్వారా వ్యోమగాములను చేర్చవలసిన అనేక బిలియన్ డాలర్ల మిషన్ కలిగిన బోయింగ్ స్టార్‌లైనర్ వ్యోమనౌక తొలిసారి సునీతా విలియమ్స్, బుచ్‌విల్మోర్ జంగతో జూన్ 5, 2024న బయలుదేరి జూన్ 6న ఐఎస్ఎస్‌కు చేరింది. ఎంపిక చేసిన అంతరిక్ష పరిశోధనలు చేసి 8 రోజుల తర్వాత తిరిగి రావలసిందిగా ప్రణాళిక చేశారు. ప్రస్తుతం వారిని సురక్షితంగా తీసుకురావడానికి నాసాకు మరో తక్షణ మార్గం ఏదీ కనిపించడం లేదు. నేడు యూఎస్‌కు చెందిన 'క్ర్యూడ్రాగన్ వ్యోమనౌక' లేదా రష్యాకు చెందిన 'సోయజ్ వ్యోమనౌక'ను పంపించి వారిని సురక్షితంగా తీసుకురావడమనే అవకాశాలను కూడా నాసా చేపట్టనున్నది. బోయింగ్ స్టార్‌లైనర్ వ్యోమనౌక ప్రయోగానికి ముందే కొన్ని సాంకేతిక సమస్యలను ఎదుర్కో వడం, వ్యోమనౌక ప్రయోగం పలుమార్లు

పొడిగించబడడం, ఫైనల్‌గా జూన్ 5 2024న ప్రయోగించడం జరిగిన విషయం మనకు తెలుసు. మానవ సహిత వ్యోమనౌకలను ప్రయోగించడానికి ముందు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవలసి ఉంటుందని, ఇప్పటికి



పలుమార్లు సఫలం అయినప్పటికీ నేడు ఆ జంట అంతరిక్ష స్టేషన్లో చిక్కుకుని పోవడం మన అందరి ఆందోళనకు కారణం అవుతున్నది. ఇప్పటివరకు సునీతా విలియమ్స్ రెండు అంతరిక్ష యాత్రల్లో కలుపుకొని 321 రోజులకుపైగా అంతరిక్షంలో గడిపిన రెండవ మహిళగా (అత్యధికకాలం అంతరిక్షంలో గడిపిన తొలి మహిళగా పెగ్గివిట్సన్ గుర్తించబడింది) చరిత్ర సృష్టించింది. అంతేకాకుండా రెండు మిషన్లలో కలిపి అంతరిక్షంలో 50గంటల 40 నిమి షాలు నడిచిన (స్పేస్‌వాక్ సమయం) మహిళగా కూడా సునీతా రికార్డు సాధించింది. గుజరాత్‌కు చెందిన దీపక్‌పాండ్యా, బోనీజలోకర్ అమెరికన్ దంపతులకు 19సెప్టెంబరు 1965న యూఎస్, ఓహియాలో జన్మించిన సునీత అమెరికాలో స్థిరపడ్డారు. యూఎస్ నావల్ అకాడమీలో ఫిజిక్స్ డిగ్రీ, ఫ్లోరిడా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్ డిగ్రీ పూర్తి చేసింది. మైఖల్ విలియమ్స్‌ను వివాహమాడిన సునీతావిలియమ్స్ చదువులు పూర్తి చేసిన తర్వాత నౌకాదళంలో బేసిక్ డ్రైవింగ్ ఆఫీసర్‌గా ఉద్యోగం ప్రారంభించి యుద్ధ విమానాలు నడపడంలో శిక్షణను పొందింది. 1998లో అంతరిక్ష వ్యోమగామిగా ఎంపికై శిక్షణ పొందింది. తొలిసారి డిసెంబర్ 2006 నుంచి జూన్ 2007 వరకు అంతరిక్ష పర్యటన చేసి సౌర ఫలకాలపై పరిశోధనలు చేసింది. 2012లో కూడా నాలుగునెలల పాటు ఐఎస్ఎస్‌లో ఆర్బిటింగ్ ప్రయోగాలపై పరిశోధనలు చేసింది. సముద్రగర్భంలో 9రోజుల పాటు మానవ ఆవాసానికి అవకాశాల పట్ల పరిశోధనలు చేసిన అపూర్వ అనుభవం సునీతావిలియమ్స్ సొంతం. ఒక సాధారణ మహిళగా సునీతావిలియమ్స్ ప్రదర్శించిన అసాధారణ తెగువ, తీవ్రపట్టుదల అనుసరణీయం, అభినందనీయం. నౌకాదళంలో చేరడం, సముద్రగర్భంలో పరిశోధనలుచేయడం, అంతరిక్ష పర్యటనల్లో అద్వితీయ పరిశోధనలు కొనసాగించడం 58 ఏండ్ల సునీతకే ప్రత్యేకం. ఆమె సాహసోపేత జీవితం నేటి ప్రపంచమహిళా లోకానికి ప్రేరణగా నిలుస్తున్నది. నేటి యువతులు తమకు ఇష్టమైన రంగంలో దూసుకుపోతూ సునీతా విలియమ్స్ వలె ప్రత్యేక గుర్తింపును పొందాలని, తమతమ రంగాల్లో ప్రజాహిత విధులు నిర్వహించాలని కోరుకుందాం. సుదీర్ఘకాలం పాటు అంతరిక్షంలో గడిపిన సునీతా విలియమ్స్, విల్మోర్ జంట అంతరిక్ష స్టేషన్ నుంచి త్వరగా సురక్షితంగా తిరిగి రావాలని కోరుకుందాం. ❑





# వాహనాల కుక్కర్లు

**వాహనాలను అమితంగా** ఇష్టపడుతూ, భోజనాన్నీ ప్రేమించే డిజిటల్ క్రియేటర్లు ఇప్పుడిలా మోటార్ బండ్లను వంటింటి బండమీదకు తీసుకొచ్చారు. తమకిష్టమైన కార్లలో తిరగడమే కాదు, తినాలనీ ఆశపడుతున్నారు. డిజిటల్ యుగంలో ఊహను కండ్లముందుకు తేవడం కదుకష్టమా చెప్పండి. అందుకే, వాటిలోనే వంట చేస్తున్నట్టు అనేకానేక డిజైన్లను సృష్టించి నెట్టింట ప్రదర్శిస్తున్నారు. దాని ఫలితమే ఇక్కడ మనకు కనిపిస్తున్న మెర్సిడెస్ ఇన్‌స్పైర్డ్‌స్టవ్‌లు, రేంజ్ రోవర్ మోడల్ రైస్ కుక్కర్లు, ఫోక్స్‌వ్యాగన్ ఎయిర్ ఫ్రైయర్లు.



వాటి వాడకం నుంచి క్లీనింగ్ వరకూ, ప్రత్యేక ఫీచర్ల మొదలు పర్యావరణం మీద ప్రభావం వరకూ అన్ని విషయాలూ విశదీకరించి మరీ వెబ్‌సైట్లలో పెడుతున్నారు. ఇవి కనుక నచ్చి, తయారు చేయాలనుకునే ఔత్సాహికులు తమను సంప్రదించమనీ కోరుతున్నారు. ❑



కథ

# ఒకే దెబ్బకు రెండు పిట్టలు

తెల్లవారకముందే వచ్చిన కుందేలును చూసిన కోతి 'రా మామా నీకోసం మామిడిపండ్లు, పనసతొనలు తీసుకువచ్చాను' అనిచెట్టుదిగి వచ్చి కుందేలుకు అందించాడు కోతి.

'మామా ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అంటే ఏమిటి?' అన్నాడు.



'అల్లుడు ఒకే దెబ్బకు రెండు పిట్టలు అనే దాన్ని కథ రూపంలో చెపుతాను విను. రామాపురం అనే ఊరిలో శివయ్య అనే అతను ఒంటి ఎద్దు బండితో ఉదయాన్నే రైస్‌మిల్లు వద్దకు వెళ్లి అక్కడ ఉన్న ధాన్యాన్ని మిల్లు వారు పంపిన దగ్గరకు చేరవేస్తూ ఉండేవాడు. ఇంటివద్ద శివయ్య భార్య నిత్యవసర వస్తువుల అంగడి నడుపుతుంది, ప్రతి ఆదివారం రైస్‌మిల్లు సెలవు కావడంతో, ఆరోజు తమ ఊరి సమీపంలోని అడవికి వెళ్లి ఎండు వెదురుగడలు కొట్టుకుని బండిపై వేసుకుని అక్కడకు నాలుగు కిలోమీటర్ల దూరంలోని సిరిపురంలోని వడ్రంగికి బండిలోనీ వెదురు గడలు ఇచ్చి, గతవారం వడ్రంగికి ఇచ్చిన వెదురుగడలను మంచాలుగా మార్చి ఉన్నందున వాటిని తీసుకుని పొరుగు ఊరిలోని వారాంతపు సంతకు వెళ్లి తనవద్ద ఉన్న మంచాలు అక్కడ అమ్ముకుని, తన ఇంటివద్ద ఉన్న నిత్యావసర సరుకుల అంగడిలో అమ్మకానికి కావలసిన వస్తువులు కోనుగోలు చేసుకుని అదే రోజు రాత్రికి ఇల్లు చేరేవాడు శివయ్య' అన్నాడు కుందేలు.

'అర్థమైనది మామా. మంచాలు అమ్ముతూ ఒక లాభం, సంతలో సరుకులు ఇంటివద్ద అమ్ముతూ మరో లాభం పొందుతున్నాడు శివయ్య. ఒకే పనిలో స్వామికార్యం, స్వకార్యంలా, ఇలా రెండు లాభాలు పొందసాగాడు, ఇలా ఆదాయం పొందడాన్నే ఒకే దెబ్బకు రెండు పిట్టలు అంటారు' అన్నాడు కోతి.

'శివయ్యలాగా అందరూ కష్టపడి సంపాదించాలి. శ్రమలో స్వర్ణం దాగి ఉంటుంది. ఎక్కడ బద్దకం, నిర్లక్ష్యం, అలసత్వం ఉంటుందో అక్కడ సోమరితనం ఉంటుంది. వయసులో ఉన్నప్పుడు శ్రమించి పొదుపు చేసుకోవాలి. వృద్ధాప్యంలో సంతతికి భారం కాకుండా, దాచిన ధనాన్ని జాగ్రత్తగా వాడుకోవాలి' అన్నాడు కుందేలు.

– బెల్లంకొండ నాగేశ్వరరావు



రంగులు వేయండి



# తెనుగు వారికోసం వెన్నెల

వార్త ఆదివారం

## బాలగేయం

### మన తెలుగు

తెలుగు బాలల్లారా
తెలుగు బాలికల్లారా
తెలుగు దీపములారా
తెలుగు వంశజులారా
తెలుగు వ్రాద్దాం
తెలుగు చూద్దాం
తెలుగు వెలిగిద్దాం
తెలుగు చూపిద్దాం
తెలుగు కోరుదాం
తెలుగు చాటుదాం
తెలుగు నేర్పుదాం
తెలుగు కూర్చుదాం
తెలుగు చిందుదాం
తెలుగు పంచుదాం
తెలుగు బాటపడదాం
తెలుగు పాటపాడుదాం
తెలుగు నోర్లను తెరుద్దాం
తెలుగు పెదాలు విప్పుదాం
తెలుగు చేతులు
కలుపుదాం
తెలుగు ఖ్యాతిని
చాటుదాం
తెలుగు తీపిపంచరా
తెలుగు తేజముచిందరా
తెలుగు మిన్నని చెప్పరా
తెలుగు సౌరభాలు
చిమ్మరా.

- గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

**గిరీష్ అంకుల్ సమాధానాలు**

**- ఎస్.సుభాష్,** కనిగిరి

**ప్రశ్న:** గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. బ్యాటరీలో విద్యుత్ ఎలా తయారవుతుంది?

**జవాబు: సుభాష్:** డ్రై సెల్‌లో జింక్‌తో తయారు చేసిన చిన్న పాత్ర లాంటిది ఉంటుంది. ఇత్తడి మూత వున్న కర్బనపు కడ్డీని పాత్ర మధ్యలో ఉంచుతారు. జింక్ నెగటివ్ ఎలక్ట్రోడుగాను, కర్బనం పాజిటివ్ ఎలక్ట్రోడుగాను పని చేస్తాయి. కర్బనం కడ్డీ చుట్టూ అమ్మోనియం క్లోరైడ్, జింక్ క్లోరైడ్, మాంగనీస్ డయాక్సైడ్, కర్బనం నింపుతారు. అమ్మోనియం క్లోరైడ్, జింక్ క్లోరైడ్‌ల మిశ్రమాన్ని నింపుతారు. ప్లాస్టర్ ఆఫ్‌పారిస్ వలన ఈ మిశ్రమం గట్టిపడుతుంది. జింక్ పాత్రను పైన పల్చటి రేకుతో మూత వేస్తారు. పాత్ర మీద పలుచటి కార్డుబోర్డును చుడతారు. ఈ విధంగా డ్రై సెల్ తయారవుతుంది. ఇది ఉత్పత్తి చేసిన విద్యుత్‌తో ట్రాన్సిస్టర్, రేడియో, టేప్ రికార్డర్, టార్చిలైట్‌లకు కావలసిన శక్తి వచ్చి పని చేస్తాయి. ఫ్లాష్‌లైట్‌లు, టెలిగ్రాఫిక్ పరికరాలలోను వాటిని ఉపయోగిస్తారు. టార్చిలైట్‌లో బ్యాటరీ వేసిన తర్వాత మీట నొక్కగానే బల్బులోని ఫిలమెంట్ వేడెక్కి కాంతి వెలువడటానికి కారణం డ్రై సెల్ ఉత్పత్తి చేసిన విద్యుత్తు.

**- సిహెచ్.కుముద,** అరక్కోణం

**ప్రశ్న:** గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. సహజమైన ముత్యాలు ఎలా ఏర్పడతాయి?

**జవాబు: కుముద:** నత్తలు లేదా ఇతర మొలస్కన్ జీవుల్లో లోపలి అవయవాలను కప్పివుంచేందుకు ఒ పొర ఉంటుంది. దీన్నే 'మాంటెల్' అంటారు. ఈ మాంటెల్ నుండి ఒ ప్రత్యేకమైన ద్రవం బయటకు స్రవిస్తుంటుంది. ఈ ద్రవాన్ని 'నాక్రే' అంటారు. ఏదైనా ఫారెన్ బాడీగానీ లేదా చిన్న పరాన్నజీవిగానీ, నత్త లేదా మొల స్కస్‌కు తగిలినప్పుడు నాక్రే అనే ద్రవ పదార్థం గుండ్రటి పలుచని పొరలు పొరలుగా ఏర్పడుతుంది. ఇలా దాని మీద ఒకటి అనేక పొరలు ఏర్పడటంతో అది ముత్యంలా రూపొందుతుంది.





ఇలపావులూరి వెంకటేశ్వర్లు

# గుహాలో కొలువు తీరిన గంగాధరుడు



లింగరాజు శ్రీపరమశివుడు ప్రపంచవ్యాప్తంగా అనేక క్షేత్రాలలో కొలువు తీరి పూజలు అందుకొంటున్నారు. ఆ దివ్యప్రదేశాలలో కొన్నింట మహేశ్వరుడు స్వయంభూగాను, మరి కొన్నింటిలో శ్రీమహావిష్ణువు, విధాత బ్రహ్మదేవుడు, ఇతర దేవీదేవతలు, దిక్పాలకులు, గ్రహాధిపతులు ప్రతిష్టించినవి. మిగిలినవి మహర్షులు కొలిచినవి కావడం గమనించవలసిన విషయం. స్వయంభూక్షేత్రాలు ద్వాదశ జ్యోతిర్లింగాలు, పంచభూత లింగాలు ఇలా ఎన్నో ఉన్నాయి. అదేవిధంగా బ్రహ్మప్రతిష్ఠిత లింగాన్ని, శ్రీమహావిష్ణు ప్రతిష్టించిన లింగాన్ని, అష్టదిక్పాలకులు సూర్యచంద్రులు ప్రతిష్టించిన లింగాలను ఒకే క్షేత్రంలో సందర్శించుకోవచ్చును. స్మరణ మాత్రమున ప్రసాదించే తిరువణ్ణామలై (అరుణాచలం). ఇక మహర్షులలో సప్తఋషులు, ఇతర మహర్షులు వేలాదిగా లింగాలను దేశ నలుమూలలా ప్రతిష్టించారు. ముఖ్యంగా శ్రీగౌతమమహర్షి దక్షిణభారతదేశంలో వందలాది పవిత్ర ప్రదేశాలలో నిత్యపూజ నిమిత్తం మహేశ్వరలింగాలను ఏర్పాటు చేసుకొన్నారు. అందుకే దక్షిణభారతదేశంలో అత్యధిక క్షేత్రాలలో స్వామిని శ్రీఅగస్తేశ్వరుడు అని పిలుస్తారు. లోకసంరక్షణార్థం అనేక అవతారాలు ధరించిన శ్రీమహావిష్ణువు తన రామావతార సందర్భంగా అనేక శివలింగాలను వివిధ ప్రాంతాలలో ప్రతిష్టించారు. కారణం అసురుడైనా, లోకకంట కుడైనా, ఎన్నో అకృత్యాలు చేసినా, జన్మతః బ్రాహ్మణుడైన రావణబ్రహ్మను సంహరించడం వలన సంక్రమించిన బ్రహ్మహత్యాదోషం తొలగించుకోవడానికి. అలా శ్రీరామచంద్రమూర్తి ప్రతిష్టించిన లింగాలు మనదేశంలోనే కాదు పొరుగుదేశాలలో కూడా నెలకొని ఉండటం విశేషం. తొలిలింగాన్ని భారతదేశంలో రామేశ్వరంలో ప్రతిష్టించిన అవతార పురుషుడు తనమార్గంలో ఎదురైనా పావన ప్రదేశాలలో లింగాలను ప్రతిష్టించారు అని క్షేత్రగాథలు తెలుపుతున్నాయి. అలాంటి ఒక విశేషలింగం పవిత్ర కృష్ణవేణి నదీతీరంలో ఇంద్రాకీలాద్రి మీద అమ్మలగన్న అమ్మ చాలా పెద్దమ్మ శ్రీ కనకదుర్గదేవి శ్రీమల్లేశ్వరస్వామితో కొలువైన విజయవాడ నగరానికి సమీపంలోని ముస్తాబాద అనే గ్రామంలో ఉన్నది.

ఈ క్షేత్రానికి కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. సహజంగా శివాలయాలలో లింగరాజు గర్భాలయం మధ్యలో కొలువుతీరి దర్శనమిస్తారు. కానీ ఇక్కడ స్వామి ఒక కొండగుహాలో ఎత్తైన పీఠం మీద, పవిత్రమైన బ్రహ్మసూత్రంతో దర్శనమిస్తారు. సదాశివుడు గుహాలో కొలువై ఉన్న ప్రదేశాలు చాలా అరుదు. గుహాలయాలు శ్రీనరసింహస్వామి నిలయాలు. అక్కడే ప్రథమ పూజ్యుడు శ్రీవినాయకుడు, శ్రీ సుబ్రహ్మణేశ్వరస్వామి, అమ్మవారు శ్రీభ్రమరాంబ దేవి ఒక పక్క, శ్రీవేంకటేశ్వరస్వామి మరోపక్క కొలువై దర్శనమిస్తారు. హరిహరులు ఒకే గుహాలో కొలువై ఉండటం దరిదాపుగా ఎక్కడా కనపడదు. ఇది మరొక విశేషం.



## ఆలయ పురాణగాథ

రావణసంహారం అనంతరం శ్రీరామచంద్రమూర్తి అనేక ప్రాంతాలను సందర్శిస్తూ కృష్ణాతీరానికి వచ్చారట. పవిత్ర నదీతీరంలో ఒక చిన్న కొండమీద గుహాలో ఒక శివలింగాన్ని ప్రతిష్టించారట. శ్రీరాముని ప్రతిష్ఠిత లింగం కావడాన స్వామిని శ్రీరామలింగేశ్వరుడు అని పిలుస్తారు.

## ఆలయ విశేషాలు

ఊరి మధ్యలో ఉన్న చిన్న కొండమీద ఉంటుంది ఆలయం. పైకి వెళ్లడానికి రహదారి, సోపాన మార్గం రెండూ ఉన్నాయి. రహదారి వద్ద వర్ణమయ స్వాగత తోరణం ఏర్పాటు చేశారు. ప్రశాంత వాతావరణం. చక్కని పరిసరాలు, మెల్లగా వీచే గాలి, శబ్ద కాలుష్యం లేని ప్రాంగణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ప్రాంగణంలో మొదటగా ఆకర్షించే మొదటి గుహాలయంలో శ్రీభద్రాద్రి రాముని దివ్యమంగళ విగ్రహం. నూతనంగా ప్రతిష్టించారు. తెలుగువారి అయోధ్య భద్రాచలంలో మూలవిరాట్టు

ఎలా ఉంటారో అదేవిధంగా ఉంటుంది ఇక్కడ స్వామివారి రూపం. పక్కనే శ్రీ వినాయకుడు, పదునెట్టాంపడిమీద శ్రీ ధర్మాశాస్త్ర, శ్రీ కుమారస్వామి కొలువై దర్శనమిస్తారు. వీరి సన్నిధికి ఎదురుగా కొద్దిగా దిగువన పుట్ట ఉంటుంది. సర్పదోషం కలిగినవారు, వివాహం కానివారు, సంతానం లేనివారు నియమంగా ప్రదక్షిణలు చేస్తుంటారు. ప్రాంగణంలో శ్రీ మేధో దక్షిణమూర్తి, శ్రీ వీరభద్రుడు, శ్రీ కాలభైరవుడు, శ్రీ సూర్యనారాయణమూర్తి కొలువై దర్శనమిస్తారు. నవగ్రహ మండపం, గోశాల కూడా ఉన్నాయి. వటవృక్షం కింద రాహు కేతువులను ప్రతిష్ఠించారు. ప్రధాన గుహకు వెలుపల ఎత్తైన ధ్వజస్తంభం, ముఖ మండపంపైన మధ్యలో ఆదిదంపతులు కుమారులతో, ఒక పక్కన కలియుగదైవం శ్రీ వేంకటేశ్వరుడు, మరో పక్కవిద్యల తల్లి శ్రీ సరస్వతి వర్ణశోభిత సుందర రూపాలు కనబడతాయి. ప్రవేశ ద్వారానికి ఇరుపక్కలా ద్వారపాలకులైన శృంగి, బృంగిస్వామి సేవలో నిమగ్నమై ఉంటారు. అర్ధ మండపంలో నందీశ్వరుడు ఉపస్థితి భంగిమలో స్వామివారి సేవకు సదా సిద్ధం అన్నట్లు కనిపిస్తాడు. ఎత్తైన పీఠం మీద శ్రీ రామలింగేశ్వరస్వామి పెద్ద లింగరూపంలో బ్రహ్మసూత్రం ధరించి చందన, కుంకుమ, విభూతి లేపనాలతో పుష్పమాలలు, నాగపడగ ధరించి నయన మనోహరంగా దర్శనమిస్తారు. పక్కనే శ్రీ వినాయకుడు, అమ్మవారు శ్రీ భ్రమరాంబా దేవి, శ్రీ అలివేలుమంగా సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దర్శనం అనుగ్రహిస్తారు. మరో ముఖ్య విషయం, విశేషం ఏమిటంటే గర్భాలయం పడమర దిశగా ఉంటుంది. కింద దూరంగా మరుభూమి ఉంటుంది. మరణించిన వారికి జరిపే అగ్నిసంస్కారం తాలూకు జ్వాల శ్రీ రామలింగేశ్వర స్వామి లింగంలో ప్రతిఫలిస్తుందట. తద్వారా జీవి తన జీవన గమనంలో చేసిన పాపకర్మలు పూర్తిగా తొలగిపోతాయి అన్నది స్థానిక విశ్వాసం.




**కార్తిక దీపం**

కార్తీకమాసం అంతా దేవాలయాలలో ఆకాశదీపం పెడతారు. నెలంతా భక్తులు మూడువందల వత్తుల అఖండ దీపాన్ని వెలిగిస్తుంటారు. కార్తికపౌర్ణమినాడు దీపాలతో అలంకరిస్తారు. తిరువణ్ణామలై (అరుణాచలం)లో పౌర్ణమినాడు గిరిపైన కార్తిక దీపం వెలిగిస్తారు. లక్షల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ముస్తాబాదలో శ్రీ రామలింగేశ్వరస్వామి కొలువైన పర్వతాన్ని 'కైలాసగిరి' అని పిలుస్తారు. భక్తుల సహకారంతో శిఖరాన పదకొండు వందల అడుగుల ఎత్తైన దీపస్తంభాన్ని నిర్మించారు. కార్తీక పౌర్ణమినాడు గ్రామస్థులు, వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చిన భక్తులు జ్యోతులతో ప్రదక్షిణ చేసి గిరిపై కార్తిక దీపాన్ని వెలిగిస్తారు. సాయంసంధ్యా సమయంలో జ్యోతికాంతులతో కైలాసగిరి శోభవర్ణింప శక్యం కానిది.

**పూజలు-ఉత్సవాలు**

నిత్యం నాలుగు పూజలు జరిగే శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం ఉదయం ఆరు నుండి పదకొండు గంటల వరకు తిరిగి సాయంత్రం అయిదు గంటల నుండి రాత్రి ఎనిమిది వరకు భక్తుల దర్శనార్థం తెరిచి ఉంటుంది. ఉత్సవాలలో, ప్రత్యేక రోజులలో, పర్వదినాలలో ఉంటుంది. ప్రతి సోమవారం, అమావాస్య, పౌర్ణమి, మాస శివరాత్రి రోజులలో ప్రత్యేక పూజలు జరుగుతాయి. ఉగాది లాంటి పర్వదినాలలో, కార్తిక మాసంలో విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు చేస్తారు. ముఖ్యంగా మంగళవారం, ఆదివారం భక్తులు ఇక్కడ వివాహం, సంతానం కొరకు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేకపూజలు చేయించుకొంటుంటారు. పుట్టకు ప్రదక్షిణలు చేస్తారు. శ్రీవినాయక చవితి, శ్రీసుబ్రహ్మణ్యషష్టి, శ్రీరామనవమి, దేవీ నవరాత్రులు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. మహాశివరాత్రి ఉత్సవాలు ఈ ఆలయంలో రంగరంగ వైభవంగా జరుపుతారు. ప్రభలు కట్టుకొని దూరప్రాంతాల నుండి కూడా భక్తులు తరలివస్తారు. నృత్యగానాలు, గ్రామోత్సవం, రథోత్సవం, అన్నదానం అన్నీ పెద్ద ఎత్తున భక్తుల సహాయ సహకారాలతో ఘనంగా చేస్తారు. ఇన్ని విశేషాలకు నిలయమైన శ్రీ రామలింగేశ్వరస్వామి కొలువైన ముస్తాబాద విజయవాడ పట్టణానికి పదిహేను కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. బస్సు సౌకర్యం లభిస్తుంది. వసతి సౌకర్యాలు విజయవాడ పట్టణంలో దండిగా లభిస్తాయి. ఆలయ సందర్శనాభిలాష ఉన్నవారు తప్పనిసరిగా సందర్శించవలసిన క్షేత్రం శ్రీ రామలింగేశ్వరసామి కొలువు తీరిన ముస్తాబాద.

❑



కథ

తాళ్ళూరి లక్ష్మి

# మూడో మనిషి

చెన్నై-హౌరా మెయిలు సరిగ్గా మధ్యాహ్నం పన్నెండు గంటలకు వైజాగ్ స్టేషన్‌లో ఆగింది.

"నేను వస్తాను మాస్టారు" అప్పటివరకు ఏసీ ఫస్టు క్లాసు బోగీలో తనతో పాటు ప్రయాణించిన ఎదుటి బెర్త్ ప్రయాణికుడు అనడంతో అంతవరకు ఏదో పుస్తకం చదువుకుంటున్న చక్రధర్ తలెత్తి చూసి నవ్వు ముఖంతో అతనికి వీడ్కోలు పలికాడు.

ఇద్దరూ నిన్న రాత్రి చెన్నైలో రైలెక్కారు. తన ప్రయాణం ఖరగ్‌పూర్ వరకు, రేపు పొద్దుటికి కానీ చేరుకోదు. ఎల్లుండి అక్కడ ఒక కాన్ఫరెన్స్ లో పాల్గొనాలి.

తిరిగి పుస్తకంలో తల దూర్చిన చక్రధర్‌కి కూపేలో మళ్లీ కలకలం వినిపిస్తే తలెత్తి చూశాడు. ఎవరో మహిళ కూలీకి సీటు కింద సూటుకేస్ పెట్టమని పురమాయిస్తోంది. కూలీకి డబ్బులిచ్చి పంపించాక ఆవిడ తన సీట్లో కూర్చుంది.

యథాలాపంగా ఆవిడకేసి చూసిన చక్రధర్ ఒక్కసారి అవాక్కయ్యాడు. "నువ్వా?" అన్నాడు ఆశ్చర్యంగా.

ఆవిడ కూడా అంతే ఆశ్చర్యంతో "మీరా?" అంది.

"బాగున్నావా అరవిందా?" తిరిగి ఆప్యాయంగా అడిగాడు చక్రధర్.

"ఏదో మీ దయ. ఇలాగ ఉన్నాను" రుద్ధకంఠంతో అంది అరవింద.

ఆమె మానసికంగా బాగా కలత చెందినట్లుంది. వస్తున్న కన్నీటిని బలవంతంగా ఆపుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆ మాటకొస్తే తన పరిస్థితి కూడా ఏమీ బాగా లేదనిపించింది చక్రధర్‌కి.

మనిషి బాగా చిక్కిపోయినట్లుంది అనుకున్నాడు చక్రధర్. కళ్లు కూడా గుంటలు పడి నీరసంగా ఉన్నాయి. సరిగ్గా ఆహారం తీసుకుంటోందో లేదో అనుకున్నాడు.

తమ జీవితాలు ఎందుకిలా అతలాకుతలం అయ్యాయి? తప్పెవరిది? తనదా, అరవిందదా? లేక అలా కావడానికి తమ జీవితాలలోకి రాహువులాగా ప్రవేశించి గ్రహణం పట్టించి పీడించిన మన్మథరావుదా? వికలితమైన చక్రధర్ మనసు గతంలోకి వెళ్లిపోయింది.

.........

వివాహం జరిగే నాటికి చక్రధర్ ఫార్మసీలో డాక్టరేట్ చేసి వైజాగ్‌లో ఒక ప్రైవేట్ ఫార్మసీ కంపెనీలో పని చేసేవాడు. అరవింద అక్కడే ఒక ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్‌గా పని చేసేది.

అరవిందకి ఇద్దరు అన్నలు, ఇద్దరు అక్కలు. అన్నలిద్దరు వైజాగ్‌లోనే ఇంజినీర్లుగా పని చేసేవారు. ఒక అక్క అమెరికాలో సెటిలైపోయింది. రెండో అక్క అనసూయ భర్త మన్మథరావుతో కలసి హైదరాబాద్‌లో ఉండేది.



మన్మథరావు బిఎస్సీ చేసి ఒక ప్రైవేట్ కంపెనీలో పని చేసేవాడు. తల్లిదండ్రులిద్దరూ బాగా పెద్దవాళ్లు కావటం, అన్నలిద్దరు వాళ్ల, వాళ్ల సంసారాలలో బిజీ కావటంతో అందరికన్నా చిన్నదైన అరవింద అనసూయతో ఎక్కువ సమయం గడిపేది.

అనసూయ భర్త మన్మథరావు అదో తరహా మనిషి. తనో కాసనోవా అనుకునేవాడు. ఇంట్లో కానీ, మరే ఫంక్షన్లలో కానీ మగవాళ్లతో కన్నా ఆడవాళ్ల చుట్టూనే ఎక్కువగా తిరుగుతూ కనిపించేవాడు. బంధువులు చాలా మంది అతన్ని ఒక తేడా మనిషిగా పరిగణించేవారు.

దానికి తగ్గట్టు కుటుంబంలో అందరి కన్నా తనే తక్కువగా చదువుకోవటంతో ఒక విధమైన ఆత్మన్యూనత అతన్ని పీడించేది. అది కప్పిపుచ్చుకోవటానికి బడాయిలు పోయేవాడు. ఎప్పుడూ ఇతరులను కించపరచడానికి ప్రయత్నించేవాడు.

ఇంట్లో అందరూ అతనికి పెద్ద బావగారని గౌరవమిచ్చినా చాటుమాటుగా నవ్వుకునేవారు, అతని మీద, అతని ప్రవర్తన మీదా జోక్స్ చెప్పుకుంటూ. చిన్న బావమరిదయితే ఎప్పుడూ ఆట పట్టించేవాడు. "పెద్ద బావగారికి ఆడవాళ్ల చీరచెంగు కనబడితే చాలు మిగతా లోకమేమీ కనిపించదని". అయితే ఇవేమీ పట్టని మన్మథరావు తన పెద్దరికం చాటున ఎన్నో వెకిలి చేష్టలు, చవకబారు వేషాలు సాగించేవాడు.

అందరికన్నా చిన్నదైన అరవిందకి మాత్రం అన్నల దగ్గర నుంచి తగినంత ప్రేమ, ఆదరణ లభించక పోవడంతో తల్లిదండ్రులిద్దరూ బాగా పెద్దవారవ్వటంతో ఎక్కువగా అక్కా బావలతో సమయం గడపడం వల్ల వారంటే ఎంతో ఇష్టం, గురి కుదిరాయి. అనసూయ కూడా భర్తకి తగ్గ ఇల్లాలే అవడంతో మన్మథరావు గురించి అరవిందకి ఎంతో గొప్పగా చెప్పేది.

దాంతో అరవిందకి మన్మథరావంటే ఒక విధమైన ఆరాధనా భావం ఏర్పడింది. అతని మాటల్ని వేద వాక్కుగా తీసుకునేది. ఏమి చెప్పినా తూచా తప్పకుండా పాటించేది. అది అలుసుగా తీసుకుని మన్మథరావు అన్నలిద్దరి మీద అరవిందకి ఒక విధమైన ద్వేషం రగిలించగలిగాడు. ఆమె ఆలోచనా సరళిని ఎంతో ప్రభావితం చేయగలిగాడు.

అటువంటి పరిస్థితిలో అరవిందకి చక్రధర్‌తో వివాహం నిశ్చయమైంది. ఇరువైపుల వాళ్లకి అన్ని విధాల సంబంధం నచ్చటంతో దగ్గరలోనే మంచి ముహూర్తం ఉండడంతో ముహూర్తాలు కూడా పెట్టేసుకున్నారు.

మన్మథరావు దూరంగా ఉండడం వల్ల ముహూర్తాలు పెట్టుకున్నాక అతనికి తెలియజేశారు. దాంతో మన్మథరావు మనసులో కుతకుతలాడిపోయాడు. తన ప్రమేయం లేకుండా అరవింద వివాహం నిశ్చయమవడం జీర్ణించుకోలేక కోపంతో రగిలిపోయాడు. అయితే పైకి ఏమీ అనలేని పరిస్థితి.

మన్మథరావుతో చక్రధర్ మొదటి ముఖాముఖి వాళ్ల పెళ్లి రిసెప్షన్‌లో జరిగింది. పెళ్లికి మన్మథరావు మొహం చాటేశాడు జ్వరం వచ్చిందని.

రిసెప్షన్‌కి చక్రధర్ ఎండి, జీఎంలు వచ్చారు. చక్రధర్‌కి అభినందనలు తెలిపి డిన్నర్ చేసి వాళ్లు వెళ్లిపోయారు.

**చక్రధర్ అరవిందను అడిగాడు "మీ బావ మీ అక్కయ్యను ఎక్కడికి తీసుకెళ్లాడని?". దానికి అరవింద "వాళ్లెక్కడికీ వెళ్లలేదు. బెంగళూరులో వాళ్ల అక్కయ్యవాళ్లింటికి వెళ్లారు" అంది.**

వాళ్లు వెళ్లిన కొద్దిసేపటికి మన్మథరావు, చక్రధర్, అరవిందలు కూర్చున్న చోటికి వచ్చి "చక్రధర్! మీ ఎండీ, జీఎంలతో మాట్లాడాను. ఇద్దరూ వట్టి కాగితంపులులు మాత్రమే. ఏమాత్రం సమర్థత లేని మనుషులు" అన్నాడు.

అప్పటికే మన్మథరావు గురించి చిన్న బావమరిది చెప్పడం వల్ల చక్రధర్ ఏమీ బదులివ్వకుండా చిన్నగా నవ్వి ఊరుకున్నాడు. మనసులో మాత్రం అయిదు వందల కోట్ల బిజినెస్ అవలీలగా సమర్థించుకొస్తున్న ఆ పెద్దాయన గురించి బేరీజు వెయ్యడానికి ఈ మహానుభావుడికి ఉన్న అర్హత ఏమిటో అనుకున్నాడు.

చక్రధర్ ఎటువంటి స్పందన తెలపకపోయేసరికి మన్మథరావు అరవింద వైపు తిరిగి "ఏమమ్మా, మీ ఆయన హనీమూన్‌కి ఎక్కడికి తీసుకెళ్తుడున్నాడేమిటి?" అనడిగాడు.

అరవింద సిగ్గు పడుతూ "తెలియదనేసరికి"–

"నువ్వు ఊరుకోకు. కాశ్మీర్ తీసుకెళ్లమను" అనేసి వెళ్లిపోయాడు.

అతనెళ్లాక చక్రధర్ అరవిందను అడిగాడు "మీ బావ మీ అక్కయ్యను ఎక్కడికి తీసుకెళ్లాడని?".

దానికి అరవింద "వాళ్లెక్కడికీ వెళ్లలేదు. బెంగళూరులో వాళ్ల అక్కయ్య వాళ్లింటికి వెళ్లారు" అంది. దాంతో చక్రధర్‌కి మన్మథరావు నైజమేమిటో మొదటి పరిచయంతోనే అర్థమైపోయింది.

ఆ తరువాత అత్తగారింట్లో మూడు నిద్రలు చేసి అరవిందని తన ఇంటికి తీసుకువచ్చాడు చక్రధర్. అత్తగారింట్లో దింపడానికి అరవిందకి తోడుగా అనసూయ, మన్మథరావులు వచ్చారు. అరవింద, అనసూయలు ఒక ఆటోలో, చక్రధర్, మన్మథరావులు మరో ఆటోలో బయల్దేరారు.

ఆటోలో మాటల మధ్యలో మన్మథరావు "అరవింద చాలా దురదృష్టవంతురాలోయ్ చక్రధర్. అరవింద నా దగ్గర వున్నప్పుడు ఒక మంచి సంబంధం త్రుటిలో తప్పిపోయింది. కుర్రాడు షావాలెస్లో రీజినల్ మానేజర్. చాలా బాగుంటాడు. మంచి జీతం. దాదాపు కుదిరిపోయింది. ఆఖరి నిమిషంలో ఎందుకో చేసుకోననేశాడు" అన్నాడు.

చక్రధర్ ఆశ్చర్యపోయాడు.. ఎవరైనా కొత్త పెళ్లికొడుకుతో అతను తాళి కట్టిన పెళ్లికూతురు గురించి ఈ విధంగా మాట్లాతారా అనుకొని. దాంతో అతనికి మన్మథరావు నైజం పూర్తిగా అర్థం అయిపోయింది. ఇకమీదట ఇతన్ని సాధ్యమైనంతవరకు దూరంగా పెట్టాలని అనుకున్నాడు.

అయితే చక్రధర్ అనుకున్నట్టు మన్మథరావుని దూరంగా పెట్టడం మాట అటుంచి అతని ప్రభావం తన కుటుంబం మీద, అంతకు మించి అరవింద మీద పడకుండా ఆపడం అతనికి ఏమాత్రం సాధ్యపడలేదు. పైగా ఆ ప్రభావం రోజు రోజుకీ మరింత ఎక్కువ కాసాగింది.

దానికి చక్రధర్ మంచితనం, మొహమాటం, సహనం ఒక కారణమైతే మన్మథరావు కుటుంబ వ్యవస్థ, అతని నైజం, జిత్తులమారితనం మరికొన్ని కారణాలు.

మన్మథరావు అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు కూడా అతని కోవకి చెందినవారే. అందుకే ఒకరంటే ఒకరికి పడేది కాదు. పైకి ఎన్ని ఆప్యాయతలు ఒలకబోసినా. ఎవరూ అతనికి వాళ్లింట్లో ఉండడానికి చోటిచ్చేవారు కాదు. అరవింద వాళ్ల అన్నయ్యలైతే అతని ముఖమే చూసేవారు కాదు.

దాంతో వైజాగ్ వచ్చినప్పుడల్లా మన్మథరావు కుటుంబం చక్రధర్ ఇంట్లోనే దిగేవారు. అరవిందకి అక్కా బావల మీద ఉన్న అభిమానం చూసి చక్రధర్ అడ్డు చెప్పలేకపోయేవాడు, మన్మథరావు ఎన్ని అవమానాలు చేసినా భరిస్తూ.

మన్మథరావు చక్రధర్‌ని కించపరడానికి ఏ అవకాశం వదులుకునేవాడు కాదు. చక్రధర్ ఒకసారి పొద్దుట వేసుకున్న చొక్కానే సాయంత్రం వేసుకుంటే "అమ్మా అరవిందా, మీ ఆయనకు బట్టలు లేనట్టున్నాయి, కొన్ని మంచి షర్టులు కొని పెట్టమ్మా" అన్నాడు.

అలాగని మన్మథరావు ప్రతి గంటకి బట్టలు మార్చే రకం కాదు. ఊరి నుంచి ఎప్పుడొచ్చినా కేవలం రెండు జతలతో వచ్చి అవే వారం రోజులు మార్చి మార్చి వేసుకునేవాడు.

ఒకసారి అరవిందకి కొద్దిగా నలతచేసి కళ్లు తిరిగినట్టయింది. మర్నాటికల్లా మామూలు మనిషయింది. మర్నాడు మన్మథరావు ఆ విషయం తెలిసి చక్రధర్ ఇంటికొచ్చి ఏమైందని అడిగాడు.

చక్రధర్ "ఏదో చిన్నపాటి నలత, కంగారేమీ లేదన్నాడు".

దానికి మన్మథరావు "అరవిందన్నా, ఆమె ఆరోగ్యమన్నా నీకేమీ లక్ష్యం లేదు. పదమ్మా అరవిందా, నేను తీసుకెళ్తా నిన్ను డాక్టరు దగ్గరకు.

**తను పెళ్లి రోజు పొద్దుటే బెంగళూరు చేరుకున్నాడు. ఇతర బంధువులను విడిదికి తీసుకువెళ్లడానికి స్టేషన్‌కి వచ్చిన మన్మథరావు చక్రధర్‌ని చూసి "నువ్వు కూడా వచ్చావా చక్రధర్?" అన్నాడు.**

మీ ఆయనకు నీ బాగోగులు అస్సలు పట్టవు" అన్నాడు, అక్కడికి అరవింద పట్ల తనకొక్కడికే అభిమానం ఉందని చాటుకోవడం కోసం.

ఇలా అవకాశం దొరికినప్పుడల్లా చక్రధర్‌ని ఏదో విధంగా కించపరచడం, అరవింద పట్ల అందరికన్నా తనకే ఏదో ప్రత్యేకమైన అభిమానం ఉందని చాటుకోవడం.

మన్మథరావు ట్రాన్స్‌ఫర్ మీద వైజాగ్ వచ్చి స్థిరపడ్డాక చక్రధర్‌కి అతన పోరు మరింత ఎక్కువైంది. ఎప్పుడైనా చక్రధర్ అతని ప్రవర్తన గురించి కోపగించుకుంటే అరవింద తీసిపడేసేది ఇదంతా మా అక్కయ్య కోసం భరించాలంటూ. అది అలుసుగా తీసుకుని మన్మథరావు మరింత రెచ్చిపోయేవాడు.

మన్మథరావుకి ఒక కారుండేది. దాంట్లో ప్రతి చోటికి తన భార్యతో పాటు అరవిందను కూడా తీసుకుపోయేవాడు సమయం, సందర్భం లేకుండా. వాళ్లతో నువ్వెందుకంటే? మా అక్కయ్య రమ్మంటోంది అనేది అరవింద. ఎప్పుడూ అరవిందనే రమ్మనేవాడు కానీ చక్రధర్‌ని ఒక్కసారన్నా రమ్మని పిలిచిన పాపాన పోలేదు.

మన్మథరావు కొడుకు పెళ్లి బెంగళూరులో అయ్యింది. పెళ్లికి రెండు రోజులు ముందు మన్మథరావు దంపతులు, వారి కుటుంబం బెంగళూరు వెళ్లారు. అలవాటు ప్రకారం మన్మథరావు అరవిందను కూడా తమతో రమ్మన్నాడు. తన అక్కయ్యకు పెళ్లిపనుల్లో తన సహాయం కావాల్సి ఉంటుందని అరవింద చెప్పడంతో చక్రధర్ సరేనని ఆమెని వాళ్లతో పంపించాడు.

తను పెళ్లిరోజు పొద్దుటే బెంగళూరు చేరుకున్నాడు. ఇతర బంధువులను విడిదికి తీసుకువెళ్లడానికి స్టేషన్‌కి వచ్చిన మన్మథరావు చక్రధర్‌ని చూసి "నువ్వు కూడా వచ్చావా చక్రధర్?" అన్నాడు.

చక్రధర్ ఏమీ మాట్లాడలేదు కానీ మిగతా బంధువులు మాత్రం అతన్ని తల వాచేటట్లు చివాట్లు పెట్టారు.

ఇలాగుండేవి మన్మథరావు లీలలు. అప్పుడప్పుడు చక్రధర్‌కి అనుమానం వచ్చేది అరవింద తన భార్యా, మన్మథరావు భార్యా అని. అయితే ప్రతిదానికీ అరవింద తన సోదరి సెంటిమెంట్ తెచ్చి కొట్టిపారేసేది.

సరే.. ఎవరి పాపాన వాళ్లు పోతారని చక్రధర్ సరిపెట్టుకుంటున్న సమయంలో ఒకరోజు సాయంత్రం ఐదు గంటలకి చక్రధర్‌కి మన్మథరావు ఫోన్ చేసి చెప్పాడు "అనసూయకి మాట ముద్ద ముద్దగా వస్తోంది అర్జెంట్‌గా రమ్మని".

చక్రధర్ ఆదరబాదరగా వాళ్లింటికి వెళ్తే అక్కడ అనసూయ పరిస్థితి చాలా సీరియస్‌గా ఉంది. అప్పటికే నోరు ఒక పక్కకి పోతోంది. స్ట్రోక్ వచ్చినట్టు తేటతెల్లంగా తెలుస్తోంది. మన్మథరావు తెల్లమొహం వేసి ఒక పక్క కూర్చుని ఉన్నాడు.

చక్రధర్ వెంటనే ఆగమేఘాల మీద ఆమెను ఒక కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి చేర్పించాడు. వాళ్లు అన్ని పరీక్షలు చేసి స్ట్రోక్‌గా నిర్ణయించి చికిత్స మొదలు పెట్టేసరికి రాత్రి పదకొండయింది. అనసూయని ఐసియూలో పెట్టాక, మన్మథరావుని ఇంటి దగ్గర దింపి మర్నాటి పొద్దుట ఆసుపత్రికి వెళ్లి చూసి, పరిస్థితి ఎలాగుందో చెబితే దాన్నిబట్టి తను కూడా వస్తానని చెప్పి ఇంటికొచ్చాడు చక్రధర్.

మర్నాడు పదకొండయినా మన్మథరావు నుంచి ఫోన్ రాకపోయేసరికి ఏమైందా? అని కంగారు పడుతుంటే అరవింద చెప్పింది "వాళ్ల బావ తనకి ఫోన్ చేసి పరిస్థితి గురించి చెప్పాడని, అంతా బాగానే ఉందనీ, తనని మధ్యాహ్నం వచ్చి ఆసుపత్రికి తీసుకుని వెళ్తానని చెప్పాడని".

చక్రధర్‌కి ఒక్కసారి కోపం నషాళానికి అంటుకుంది. నిన్నంతా గాడిదలా పని చేయించుకుని "ఏరు దాటేదాక ఓడమల్లన్న, ఏరు దాటేక బోడి మల్లన్న" అన్నట్టు ఇప్పుడు తన అవసరం తీరిపోయేసరికి ఫోన్ చెయ్యడానికి కూడా మనసు రాలేదా?

ఆ కోపంలో అరవిందనీ, వాళ్ల బావనీ చెడా మడా తిట్టేశాడు. ఇన్ని ఏళ్లుగా మనసులో గూడు కట్టుకున్న ఆవేశమంతా కోపమై ప్రవహించి అరవిందకి హెచ్చరిక చేశాడు.. ఆ రోజు నుండి మన్మథరావు కుటుంబంతో తన కుటుంబానికి ఎటువంటి సంబంధాలు ఉండకూడదని.

అరవింద కూడా అంతే ఆవేశంతో "అది ఎట్టి పరిస్థితుల్లోనూ వీలు కాదంది".

కోపంలో భార్యాభర్తలిద్దరూ మాటా మాటా అనుకున్నారు. చక్రధర్ "నేను కావాలో, వాళ్లు కావాలో తేల్చుకోమంటే" వాళ్లే కావాలంది. ఆ క్షణంలో చక్రధర్‌కి ఎక్కడలేని వైరాగ్యం, నైరాశ్యం ఆవరించుకున్నాయి. ఈ మానవ మనుగడ మీదే నమ్మకం పోయింది.

ఉన్న పళాన ఆఫీసుకు వెళ్లి, రాజీనామా చేసి, అప్పటికప్పుడు రైలెక్కేశాడు. మర్నాడు చెన్నై చేరుకుని ఒక మిత్రుడి ఇంట్లో పదిహేను రోజులుండి కొత్త ఉద్యోగం సంపాదించుకున్నాడు.

ఇది జరిగి దాదాపు ఐదేళ్లు కావస్తోంది. ఈ ఐదేళ్లు తన ఉనికి ఎవ్వరికీ తెలియకుండా జాగ్రత్త పడ్డాడు. తిరిగి ఇప్పుడే అరవిందని కలవడం.

.........

గతమంతా సినిమా రీళ్లలా కళ్ల ముందు తిరుగుతుంటే చక్రధర్ ఆలోచనలో పడ్డాడు. ఆరోజు ఆవేశంలో తొందరపడి తను తప్పు చేశాడా? ఒక పయోముఖ విషకుంభాన్ని వివేకంతో అణచలేక తమ ఇద్దరి జీవితాల్ని నాశనం చేసుకున్నాడా?

కడివెడు పాలలో చిటికెడు ఉప్పు వేస్తే పాలన్నీ విరిగిపోతాయి. అలాగని ఆ కడివెడు పాలను పారబోసేబదులు, విరిగిన ఆ పాలతోనే రక రకాల స్వీట్లు చేసుకోవడం ఇంగిత జ్ఞానం అనిపించుకుంటుంది.

మన్మథరావు పాలలో పడ్డ ఉప్పులాంటివాడు. అలాంటి వాడికోసం తమ జీవితాల్ని నాశనం చేసుకోవడమేమిటి? ఇలా పరిపరి విధాల సాగాయి చక్రధర్ ఆలోచనలు.

అదే సమయంలో అరవింద మనసులో కూడా ఎన్నో ఆలోచనలు ముసురుకోసాగాయి. ఆ రోజు చక్రధర్ ఇల్లు విడిచిపోతేగానీ తన తప్పిదమేమిటో తెలిసిరాలేదు.

మర్నాడు తన సహోద్యోగి సునందకు జరిగిన విషయం చెప్పి వాపోతే తన తల వాచేటట్లు తిట్టిపోసింది.

**(మిగతా 29వ పేజీలో...)**

# అమ్మభాషను మరవద్దు

సి.మెహర్‌కుమార్

గిడుగు రామమూర్తి పంతులు బహుముఖ ప్రజ్ఞాశాలి. 1910 నుండి మూడు దశాబ్దాల పాటు వ్యవహారిక భాషోద్యమాన్ని నిర్వహించి ఆధునిక తెలుగు సాహిత్యాలకు గొప్ప స్ఫూర్తిని కలుగచేశారు. ఇలా ఉద్యమస్ఫూర్తిని కలిగిస్తూ వ్యవహారిక భాషలో రాసిన వివిధ వ్యాసాలను అక్కిరాజు రమాపతిరావు ద్వారా సంకలనం చేయించి ప్రచురించిన పుస్తకం గిడుగు వెంకటరామమూర్తి సాహిత్య వ్యాసాలు.

సమాజానికి, దేశానికి, జాతికి, సాహిత్యానికి గొప్ప మేలు చేసినపుడే ఒక వ్యక్తిని మహాపురుషుడని, మహాత్ముడని, మహనీయుడని ప్రజలు భావిస్తారు. అంతకు పూర్వం లేని కొత్త వికాసాన్ని, పరిణామాన్ని, సమాజ హితాన్ని ఆ వ్యక్తి సాధించినపుడు ఆ జాతి జనులకు ఆయన చిరస్మరణీయుడంటాం. ఆధునిక భాషా సాహిత్య చరిత్రలో 'గిడుగు రామమూర్తి' అటువంటి వారిలో ప్రముఖులు. ప్రపంచాన్ని చూసి నేర్చుకోండి అని తెలుగు వారికి ప్రబోధించిన గిడుగు తెలుగును అధునీకరించడానికి చేసిన సేవలను గుర్తించుకోవాల్సిందే.

1863 ఆగస్టు 29న వెంకమ్మ, వీరరాజు దంపతులకు శ్రీకాకుళం జిల్లా పర్వతాలపేట గ్రామంలో జన్మించిన గిడుగు రామమూర్తి పంతులు అక్షరాభ్యాసం అయ్యాక గున్నయ్య అనే పంతులు ఇంటికి వచ్చి తెలుగు, సంస్కృతం, గణితం నేర్పేవాడు. అలా ప్రారంభమైన విద్య 8 సంవత్సరాలకే 'శబ్దమంజరి'ని నేర్చుకుని తర్వాత మహారాజు కళాశాలలో గిడుగు, గురజాడ సహాధ్యాయులుగా, 1880లో పర్లాకిమిడి రాజావారి పాఠశాలలో ఉపాధ్యాయుడుగా ఉద్యోగంలో చేరి పైచదువులు చదువుతూనే చుట్టుపక్కల నివసించే 'సవరజాతి' ప్రజలతో పరిచయం పెంచుకుని సవర భాషలో వాచకాలు, నిఘంటువులు తయారు చేశాడు. ఏ భాషలోనైనా రచనలు వ్యవహారిక భాషలో ఉండడం సహజం, కానీ తెలుగులో రచనలు కానీ, వాచకాలు కానీ ఆనాటికి వ్యవహారిక భాషలో లేవని, గ్రాంథిక భాషలో ఉన్నాయని గ్రహించి గ్రాంథిక భాషలో విద్యాబోధన జరగడం వల్ల చాలా మంది చదువుకు దూరంగా ఉండడమే కాకుండా వాళ్లలో ఎంత సృజనాత్మక శక్తి



ఉన్నా వ్యాకరణ దోషాలకు భయపడి కలం పట్టేవాళ్లు కాదు. ఈ దుస్థితిని తొలగించడానికి వ్యవహారిక భాషావాదాన్ని లేవదీసి గ్రాంథిక భాషను మూడు సంవత్సరాల పాటు రోజుకు 16 గంటలు శ్రమించి తెలుగుభాషలోని కావ్యాలను, ప్రబంధాలను క్షుణ్ణంగా చదివి, వ్యాకరణాలను అధ్యయనం చేసి ప్రజలకు ఉపయోగపడే వ్యవహారిక భాషలో రచనలు రాయడం మొదలు పెట్టి, 'తెలుగు' అనే పత్రికను పూర్తి వ్యవహారిక భాషలో నడపడంతో ఈ భాషను ఆదర్శంగా తీసుకుని 'ప్రబుద్ధాంధ్ర' ప్రతిభ, వీణ, సాహితి పత్రికలు 'ఆంధ్రపత్రిక' నాటి నుంచి వ్యవహారిక భాషలో రాయడం మొదలైంది.

## సవర భాష పాండిత్యం..

ఆ రోజుల్లోనే ఆయనకు దగ్గర ఉన్న అడవుల్లో ఉండే సవరల భాష నేర్చుకుని వాళ్ళకు చదువు చెప్పాలనే కోరిక కలిగింది. తెలుగు, సవర భాషలు రెండూ వచ్చిన ఒక సవర వ్యక్తిని ఇంట్లోనే పెట్టుకుని సవర భాష నేర్చుకున్నాడు.

ఈ పరిశ్రమ చాలా ఏళ్ళు జరిగింది. సవర భాషలో పుస్తకాలు రాసి సొంత డబ్బులతో బడులు పెట్టి, అధ్యాపకులకు జీతాలు చెల్లించి సవరలకు వారి భాషలోనే చదువు చెప్పే ఏర్పాట్లు చేశారు. మద్రాసు ప్రభుత్వం ఆయన చేసిన కృషికి మెచ్చి 1913లో 'రావు బహదూర్' బిరుదు ఇచ్చారు.

భాషా శాస్త్రంలో అప్పుడప్పుడే వస్తున్న పుస్తకాలు చదివి వ్యాకరణ నిర్మాణ విధానం నేర్చుకున్నారు. 1931లో ఇంగ్లీషులో సవరభాషా వ్యాకరణాన్ని, 1936లో సవర-ఇంగ్లీషు కోశాన్ని నిర్మించారు. మద్రాసు ప్రభుత్వంవారు గిడుగు ఆంగ్లంలో తయారు చేసిన సవరభాషా వ్యాకరణాన్ని, సవర-ఇంగ్లీషు కోశాన్ని అచ్చువేశారు. ప్రభుత్వం ఆయనకు 'కైజర్-ఇ-హింద్' అనే స్వర్ణ పతకాన్ని ఇచ్చి గౌరవించింది.

## వ్యక్తిత్వం..

రామమూర్తికి చిన్నప్పటి నుంచి విద్యాసక్తి, కార్యదీక్ష, సత్యాన్వేషణ ప్రధాన లక్షణాలు. సవరలు, హరిజనులూ అంటరాని జనాలని అంటుండే ఆ కాలంలోనే ఆయన సవర విద్యార్థులకు తన ఇంట్లోనే బస ఏర్పాటు చేసి



భోజనం పెట్టేవాడు. గిడుగు తెలుగువారికి నాయకునిగా నిలిచి ప్రతిఘటించాడు. ఆ తాలూకాలో చాలా భాగాన్ని పర్లాకిమిడి పట్టణాన్ని ప్రభుత్వం అక్రమంగా ఒడిసాలో చేర్చడం వల్ల తెలుగువారికి అన్యాయం జరిగిందని తెలియజేస్తూ, పర్లాకిమిడిలో ఉండడానికి ఇష్టపడక 1936లో ఒడిసా రాష్ట్రం ప్రారంభోత్సవం జరిగే రోజే రాజమహేంద్రవరం వచ్చి అక్కడే తన శేషజీవితాన్ని గడిపాడు. ఆయన పట్టుదలకు ఇది గొప్ప నిదర్శనం. గిడుగుకు తెలుగుభాషకు మేలు జరగాలన్నదే తప్ప వ్యక్తిగతంగా తన పేరు రావాలన్న ఆలోచన పట్టింపు ఉండేవి కాదు. ఒక వ్యాకరణంలో గిడుగును ప్రస్తావించకుండా ఆయన రచనలోని భాగాలు వాడుకున్నారని బావరాజు వెంకటకృష్ణారావు బాధపడితే 'అక్షరాలు కనిపెట్టినవాడి పేరెవరికైనా తెలుసునా? అట్లాగే నా పేరు తెలిస్తేనేం. తెలియకపోతేనేం?' అని గిడుగు రామమూర్తి ఓదారుస్తూ జవాబిచ్చాడు.

ఆ విధంగా అవిరళ కృషి చేసిన తెలుగుభాషను పరిపుష్టం చేసిన గిడుగు రామమూర్తి పంతులు 1940 జనవరి 22న పరమపదించారు. తెలుగుభాషను మరిస్తే కన్నతల్లిని మరచినట్లే.. అని పలువురు పేర్కొంటున్నారు.

# వారికి.. కొన్ని మాటలు

యామిజాల జగదీశ్



"ఇందాకట్నుంచి తాతయ్య పిలుస్తున్నారురా.. వెళ్లు. ఎందుకు పిలుస్తున్నారో వెళ్లి చూడరా!" అంది అమ్మ.

"ఆయన అలానే పిలుస్తుంటారమ్మా. ఆయనకు పనీ పాటా లేదమ్మా. కావాలంటే నువ్వు వెళ్లి చూడు" అన్నాడు తల్లితో కుర్రాడు.

ఆ సమయంలో అక్కడున్న నేను ఆ కుర్రాడిని నెమ్మదిగా దగ్గరకు పిలిచి "పెద్దవాళ్లు పిలిస్తే వెళ్లి "ఏం కావాలని అడగాలి. అది కనీస మర్యాద" అని ఆ సమయంలో వాడితో చెప్పాను.

కుర్రాడు వెంటనే "ఏమిటీ? నాకు సలహా ఇవ్వడం మొదలు పెట్టారా? విషయం తెలియకుండా మాట్లాడకండి. మా తాతయ్యతో మీరు ఓ పది నిమిషాలు మాట్లాడితే తెలుస్తుంది" అన్నాడు కుర్రాడు.

"ఎందుకలా చెప్తున్నావు?" అని అడిగాను నేను.

"మరేంటి సార్! ఎప్పుడు చూసినా నేను 1940లో మైసూరులో పని చేస్తున్న రోజులవి.." అని ఉపన్యాసం మొదలు పెడతారు. ఒక్క లైను కూడా విడిచిపెట్టకుండా చెప్పిందే చెప్తారు. ఎన్ని సార్లు ఆ మాటల్ని ఓపికతో వినాలి. మీరే చెప్పండి... ఎప్పుడూ ఒకటే విషయం. బోరు కొడుతుంది సార్" అన్నాడు కుర్రాడు.

అప్పుడు నా అడ్వయిస్ అవసరమైంది కుర్రాడికి కాదు, వాడి తాతయ్యకే అని అర్థమైంది. అందుకే తాతలకీ విషయం చెప్పాలనిపించింది.

అది మరేమీ కాదు. ఇప్పటి కాలం చాలా వేగంగా మారుకుంటూ పోతోంది. అందువల్ల ఆ కాలంనాటి విషయాలనే మళ్లీ మళ్లీ చెప్తూ గొప్పలు చెప్పుకోవడం సముచితం కాదు. దానిని ఈ కాలం పిల్లలు ఎక్కువసేపు ఓపికతో వినలేరు.

మీరు ఒక అడ్వయిసరుగా ఉండొచ్చు. అంతేతప్ప బోరు కొట్టించకూడదు.

ఇంట్లో జరిగే అన్ని కార్యక్రమాలలోనూ పాల్గొనండి. అంతేతప్ప ప్రతిదానికీ అడ్డుపడకండి.

ఎవరినీ నిందించకండి. హేళన చేయకండి. మీరు యుక్త వయసులో ఓ పెద్ద ఉద్యోగంలో ఉండి ఉండవచ్చు. కాదనను. పలువురు మీ ఆదేశాలకు శిరస్సు వంచి పని చేసి ఉండొచ్చు. మీ మాట విని బుర్రలు ఊపి ఉండవచ్చు.

రిటైర్ అయిన తర్వాత కూడా ఇంట్లో ఉన్నవారిని అలానే ఆదేశిస్తూ ఏదో చేయించుకోవాలనుకోవడం అంత సబబు కాదు. పూర్వంలా మీరు మర్యాదను అంతగా ఎదురు చూడలేరు. అసలు మర్యాదను ఆశించకుండా ఉంటే మీ మనసుకు ప్రశాంతత లభిస్తుంది.

అధికార ధోరణిని పదవీ విరమణ చేసిన రోజునే విడిచిపెట్టాలి. ఆ తర్వాత అందరితోనూ అణకువతో మాట్లాడటం అలవాటు చేసుకోవాలి. అధికార దర్పాన్ని మానుకోవడం మంచిది. అప్పుడు మర్యాద అనేది మీకు తానుగా వస్తుంది.

రిటైర్ అనేది మీరు చేసిన ఉద్యోగం నుంచి విరమణ పొందడమని అర్థం. అంతేతప్ప ఇంకా దాన్ని మనసులో పెట్టుకుని ప్రవర్తించడం అనేది సరికాదు. రిటైర్మెంట్ తర్వాత ఇంటి పనుల పట్ల అక్కర చూపాలి. చిన్న చిన్న పనులైనా చేయాలి. పిల్లలకు, మనవళ్లు/ మనవరాళ్లకు చివరి వరకూ మనం ప్రయోజనకరంగా ఉండేలా మనల్ని మనం తీర్చిదిద్దుకోవాలి. నేను రిటైర్ అయిపోయాను. ఇక మీదట మనల్ని పిల్లలే చూసుకుంటారని తేలికగా భావించకూడదు.

కూరగాయలు కొనుక్కురావడం, మనవళ్లు/మనవరాళ్లను కసురుకోకుండా పాఠం చెప్పడం...

ఇలా ఏదో ఒక పని చేస్తూ ఉండాలి.

ఇప్పటి పిల్లల అలవాట్లు, ఇష్టాయిష్టాలు వేరు. మీ మనవరాలు పాప్ సంగీతాన్ని ఇష్టపడవచ్చు. అది మీకు ఇష్టం లేకపోవచ్చు. అలాగే జడ వేసుకోవడం ఇష్టం లేకుండా బాబ్డ్ హెయిర్ ఇష్టపడొచ్చు. కానీ అది తెలుసుకోకుండా గొడవ పడటం, బలవంతంగా జుత్తు పెంచమని చెప్పడం వల్ల ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి మీరు మర్యాదను కోల్పోవడం జరుగుతుంది. అప్పుడు బాధ మీకే. ఒకవేళ ఏదన్నా చెప్పాలనుకున్నా నెమ్మదిగా చెప్పాలి.

ఇంకొక విషయం.. వయస్సు అయిపోయింది కదా అని.. గడ్డాలు, మీసాలు పెంచేసుకుని ఏదో అంతా కోల్పోయినట్టు ఉండకూడదు. నాకిక ఎందుకు? అనుకుని మురికి పట్టిన బట్టలు, నలిగిన బట్టలు వేసుకోవడం అంత మంచిది కాదు. మంచి డ్రెస్ వేసుకోవాలి. మీ డ్రెస్ విషయంలో ఒకింత శ్రద్ధయినా చూపాలి.

బామ్మ చూసీ చూడటంతోనే ఆశ్చర్యపోయేలా ఉండాలి. వయస్సు మళ్లిన భార్యాభర్తలు ఇప్పటికీ ఎందరో ఎంత హుషారుగా ఉన్నారో చూసాను.

నేనొక రోజున ఓ వయసు మళ్లినాయన పెద్దాయనను చూడ్డానికి వెళ్లాను. ఆయన వయస్సు ఎనభై ఆరేళ్లు. ఇంత వయస్సులోనూ ఆయన ఎంత ఉషారుగా ఉన్నారో..!

నేను మాట వరసకి జోక్ చేసాను. "ఏంటండీ! మీరు ఇప్పుడు కూడా ఇంకో పెళ్లి చేసుకోవచ్చన్నట్టుగా ఉన్నారుగా చూడ్డానికి" అని.

ఆయన వెంటనే విస్తుపోయారు. ఆయనలో ఓ విధమైన కంగారు.

అది చూసి నాకు కాస్త భయమేసింది... అనరాని మాట అన్నానేమోనని. "నేను ఏదైనా తప్పుగా చెప్పేనా?" అని లోలోపల నన్ను నేను ప్రశ్నించుకున్నాను.

అప్పుడాయన "నువ్వేమీ తప్పుగా అనలేదు. సరిగ్గానే చెప్పావు. నేను కంగారు పడటానికి కారణం.. నువ్వు చెప్పిన మాటకు కాదు. లోపలున్న బామ్మ ఈ మాట వింటే అప్పుడు నా పరిస్థితి ఏమిటా? అని ఆలోచించి కంగారు పడ్డానని" ఆయన అన్నారు.

# నైరుతి దిక్కు ప్రత్యేకత ఏమిటి?

**వాస్తువార్త**
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్స్: 9885446501/9885449458



**ఎన్.ప్రభావతి – వరంగల్**

**ప్రశ్న: గురువుగారూ! నైరుతి అనగానే అందరూ భయపడుతూ ఉంటారు. అయితే అనారోగ్యాలు, ఆక్సిడెంట్లు అని కూడా ఒక ముద్ర పడిపోయింది. వాస్తు శాస్త్రం ప్రకారం నిజంగానే అలాంటిదేమైనా ఉందా?**

**జవాబు:** నైరుతి దిక్కు అనేది మనకున్న ఎనిమిది దిక్కుల్లో చాలా శక్తివంతమైంది. అలాగని మిగతా దిక్కులు శక్తివంతమైనవి కాదని చెప్పటం నా ఉద్దేశం కాదు. ప్రతి దిక్కుకి దేనికుండే ప్రాధాన్యం, ప్రత్యేకత దానికి ఉంటాయి. ఇప్పుడు నైరుతి దిక్కు ప్రత్యేకత గురించి చెప్పుకుందాం. మన ఇంట్లో స్ట్రిక్ట్‌గా ఉండే నాన్నగారి దగ్గరికంటే కొంచెం శాంతంగా ఉండే అమ్మ దగ్గర మనకి చనువు ఎక్కువ. అమ్మ దగ్గర మనకి భయం ఉండదు. ఏమైనా కావాలంటే మారాం చేసి అడిగే స్వతంత్రం మనకు ఉంటుంది. కానీ నాన్న కచ్చితంగా ఉంటాడు. కాబట్టి నాన్న దగ్గర అట్లాంటివి కుదరవు. మనల్ని క్రమశిక్షణలో పెట్టటానికి ఆయన స్ట్రిక్ట్‌గా ఉంటారు. పెట్టేది కాబట్టి ఆయన చెప్పినట్టు పోవటం అంటూ ఉండదు.

అందుకే అందరికీ ఆయనంటే భయం. అందరి మీద ఆయనకు కమాండ్ ఉండాలి. అప్పుడే కుటుంబం అంతా ఒక తాటిపైన నడుస్తుంది. ఏమైనా సమస్యలు వస్తే ఆయన చూసుకుంటారులే అన్న ధీమా కూడా కుటుంబంలో సభ్యుల పైన ఉంటుంది. అదే భయం, అదే నమ్మకం కూడా. ఎక్కడైతే స్థిరత్వం, భరోసా, రూలింగ్ కచ్చితంగా ఉంటాయో అందుకు సంబంధించిన 'వైబ్రేషన్స్' కూడా పాజిటివ్‌గా వస్తూ ఉంటాయి. ఇవన్నీ మనకు అవసరం కాబట్టి వీటిని ప్రభావితం చేసే నైరుతి మూల పర్ఫెక్ట్‌గా ఉండాలి.

నైరుతి గదిని చిన్నవాళ్లకు ఇచ్చినా సరే, వాళ్లకి కుటుంబం మీద అజమాయిషి చేయగలిగే శక్తి వస్తుంది. ఆయన మాటను కూడా అందరూ వింటారు. మన హిందూ సంప్రదాయంలో ఏమిటంటే ఎవరైనా పెద్దవారు ఉంటే వారి బాధ్యతలో, అజమాయిషీలో మొత్తం కుటుంబం నడవాలి అనుకుంటాం. నైరుతి మూలన గదిని ఇంటి యజమానికి ఇవ్వటంలో ఆంతర్యం కూడా అదే. నైరుతి మూల పర్ఫెక్ట్‌గా లేకుండా పశ్చిమ నైరుతిగానీ, దక్షిణం నైరుతిగానీ కొంచెం పెరిగింది అనుకోండి.. అది వాస్తుదోషం అవుతుంది.

ఈ దోషం వలన కుటుంబంలో ఉన్న సభ్యులందరూ ఒకరి మాట మీద, లేదా ఒక్క మాట మీద ఉండకుండా ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించడం జరుగుతుంది. దీనివల్ల అనేక కుటుంబ సమస్యలు తలెత్తుతాయి.

ఇలాంటప్పుడు జీవన ప్రయాణంలో కొన్ని ప్రతికూల సంఘటనలు సర్వసాధారణం. నేరుగా ఉన్న రోడ్ మీద వాహనంతో ప్రయాణం చేస్తున్నప్పుడు స్టీరింగ్ మన చేతిలో లేకపోతే రోడ్డు నేరుగా ఉన్నా, వాహనం బాగానే ఉన్నా, కారు వంకర టింకరగా తిరగడం మొదలు పెడుతుంది కదా! ఆ కుటుంబం పరిస్థితీ అట్లాగే తయారవుతుంది. నైరుతి మూల 90 డిగ్రీల కంటే తక్కువ ఉంటే నైరుతి మూల పెరిగినట్లు నిర్ధారణ చేసుకోవాలి. ఈ దోషం వలన తరచూ అనారోగ్య సమస్యలు రావడం, అనేక రకాల రుగ్మతలకు లోనవటం, ఔషధాలు సేవించటం, సైడ్ ఎఫెక్ట్స్ వల్ల ఇంకా ఆరోగ్యం చెడిపోవడం, మందులకు–టెస్టులకు ధనం విపరీతంగా ఖర్చవటం, ఖర్చులు ఎక్కువ అవటం వలన మరొక రకమైన సమస్యలు రావడం.. ఇలాంటి సమస్యలు వస్తూ ఉంటాయి.



నైరుతి మూలలో ఇంకా తీవ్రమైన దోషాలు ఏవైనా ఉంటే దుష్ఫలితాల తీవ్రత కూడా ఎక్కువగా ఉంటుంది. తీవ్రమైన దోషాలు అంటే– నైరుతి మూలన సెప్టిక్ ట్యాంక్/వాటర్ సంపులు/బావులు ఉండటం లేదా పశ్చిమ నైరుతి నుండి కానీ దక్షిణ నైరుతి నుండి కానీ ఏవైనా వీధిపోట్లు ఉండటం..

ఇవన్నీ తీవ్రమైన వాస్తు దోషాల కిందకే వస్తాయి. ఈ దోషాల వలన దుష్ఫలితాల తీవ్రతలు కూడా ఎలా ఉంటాయంటే– అనారోగ్య సమస్యలు తీవ్రంగా ఉండటం, యాక్సిడెంట్స్ ఏవైనా జరిగితే తీవ్రంగా జరగటం,

**(మిగతా 29వ పేజీలో...)**

వాస్తువిద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3

**వాస్తువార్త**

పూర్తి పేరు.................................................

పుట్టినతేదీ : ...................... ఊరు : ....................

జన్మ నక్షత్రం: ...............తల్లి పేరు: ....................

చిరునామా: .................................................




# ఆత్మరక్షణ ధీరత్వం

కస్తూరి మురళీకృష్ణ

**అది వారణాసిలో బ్రహ్మాదత్తుడు రాజ్యం చేస్తున్న సమయం.**

**ఆ సమయంలో బోధిసత్త్వుడు నగరం దగ్గర ఉన్న శ్మశానంలో వేపచెట్టు దేవతగా జన్మించాడు.**

**ఒక రోజున ఓ దొంగ నగరానికి ద్వారంలా ఉండే గ్రామంలో దొంగతనం చేశాడు. తాను దొంగిలించిన వస్తువులన్నీ వేపచెట్టు కింద పెట్టి అక్కడ నిద్ర పోయాడు.**

**వేపచెట్టు పక్కనే రావిచెట్టు ఉంది.**

ఆ కాలంలో దొంగలకు ఒక ప్రత్యేకమైన శిక్ష వేసేవారు.

దొంగ పట్టుబడగానే వేపచెట్టు నరికి, శూలంగా చేసి దొంగ వీపుపై ఎక్కిస్తారు.

ఆ బరువును మోస్తూ దొంగ వీధుల గుండా తిరగాలి.

వేపచెట్టుకు ఈ విషయం తెలుసు.

ఇప్పుడు ఆ దొంగ పట్టుబడితే ముందుగా తన కొమ్మను విరగ్గొడతారు. అందుకని ఆ దొంగను తన దగ్గర నుంచి తరిమేసేందుకు వేపచెట్టు నిశ్చయించింది.

ఆ దొంగతో "ఒరే దొంగవెధవా, చేసే దొంగతనం ఎలాగో చేశావు. దొంగతనం చేసినవాడివి దోచుకున్న సొమ్ము తీసుకుని ఎక్కడికయినా పారిపో. ఇక్కడే పడుకుని ఉంటే భటులు నిన్ను పట్టుకుంటారు. ఘోరంగా శిక్షిస్తారు. కాబట్టి పారిపో. భటులకు చిక్కి అనవసరంగా కష్టపడటం ఎందుకు?" అని అంది.

వేపచెట్టు మాటలు విన్న దొంగకు నిద్ర పట్టలేదు. తాను దొంగిలించిన వస్తువులను తీసుకుని అక్కడి నుంచి పారిపోయాడు.

ఇదంతా పక్కనే ఉన్న రావిచెట్టు చూస్తూనే ఉంది. దొంగ పారిపోగానే వేపచెట్టును అడిగింది.

"వాడు దొంగ. వాడెవడో నీకు తెలియదు. వాడు దొంగతనం చేశాడు. వాడిని భటులు పట్టుకుపోతే నీకేమయింది? నువ్వెందుకు వాడిని తరిమేశావు? ఈ విషయాల్లో నువ్వెందుకు జోక్యం చేసుకున్నావు? నీవు జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఏముంది?"

దానికి వేపచెట్టు సమాధానం ఇచ్చింది.

"నాకూ దొంగకూ ఉన్న సంబంధం నీకు తెలియదు. ఆ దొంగ దొరికితే, ముందు నా కొమ్మ విరిచి వాడి వీపున కట్టి మోయిస్తారు. తరువాత నా కొమ్మకు వాడిని వేలాడగట్టి ఉరి తీస్తారు. అందుకని వాడిని పారిపొమ్మన్నాను. తప్పు చేసింది వాడు. శిక్ష, నష్టం నాకు".

చెట్లు ఇలా మాట్లాడుకుంటున్న సమయంలో దొంగ కాలిగుర్తులను బట్టి వెతుకుతూ రాజభటులు చెట్టుదగ్గరకు వచ్చేశారు.

అక్కడి నుండి దొంగ పారిపోయిన చిహ్నాలు కనిపించాయి.

"అరే... దొంగ తప్పించుకు పారిపోయాడు. మనకు గనుక వాడు దొరికి వుంటే వాడిని చెట్టుకు కట్టి హింసించేవాళ్లం. చెట్టు దుంగలు వాడివీపుకు కట్టి మోయించేవాళ్లం. చివరికి చెట్టుకొమ్మకు వేలాడదీసి ఉరి తీసేవారం. అదృష్టవంతుడు.. తప్పించుకుపోయాడు" అని రాజభటులు తమలో తాము అనుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు.



ఇదంతా చూస్తున్న రావిచెట్టు వేపచెట్టుతో అంది.

"ఆత్మరక్షణ కోసం ప్రయత్నించటం భావ్యమే. ఆత్మరక్షణ చేసుకోవటం ఒక ధీరత్వం. భవిష్యత్తు, వర్తమానాలపై దృష్టి ఉన్నవాడే ఆత్మరక్షణ చేసుకోగలడు.

శాస్త కథను ముగించాడు. కథ ముగింపుగా చెప్పాడు.

ఆ కాలంలో రావిచెట్టు దేవత సారిపుత్రుడు. వేపచెట్టు దేవతను నేనే".

.............

అది శాస్త జేత వనంలో విహరిస్తున్న కాలం.

ఆ కాలంలో శాస్త ఒక వృద్ధ భిక్షువు గురించి చెప్పాడు.

.............

ఆ కాలంలో శ్రావస్తిలో ఒక వ్యక్తి కామభోగాల వల్ల కలిగే చెడు ఫలితాలను గ్రహించాడు. అతడు శాస్తను సమీపించి కామభోగాల పట్ల తన విరక్తిని వెల్లడించాడు.

శాస్త ద్వారా ప్రవ్రజించాడు. యోగాభ్యాసం చేశాడు. శాస్త సూచనలను తుచ తప్పకుండా పాటించి అర్హత్వం పొందాడు.

కాలక్రమంలో అతని తల్లి మరణించింది.

దాంతో అతని తండ్రి, తమ్ముడు కూడా ప్రవ్రజిత్వం స్వీకరించారు. వారంతా కలిసి జేతవనంలో నివసించటం ఆరంభించారు.

వర్షాకాలంలో ఒక గ్రామంలో చీవరాలు సులభంగా లభిస్తాయని తెలిసి వారు ఆ గ్రామంలో కొన్నాళ్లు నివసించారు. వర్షాకాలం అయిపోగానే జేతవనానికి తిరిగి ప్రయాణం ఆరంభించారు.

వారితో ఉన్న వృద్ధ స్థవిరుడు మెల్లమెల్లగా నడుస్తున్నాడు. ఇది చూసి తరుణభిక్షువు "నేను త్వరత్వరగా జేతవనం వెళ్లి ఆశ్రమంలో మన నివాస స్థలాన్ని శుభ్రం చేస్తాను. ఆవరణను శుభ్రం చేస్తాను. ఊడ్చి నీళ్లు చల్లుతాను" అన్నాడు.

వారి అనుమతి పొంది వేగంగా నడుస్తూ వెళ్లిపోయాడు.

అతను వెళ్లిపోయిన తరువాత వృద్ధ స్థవిరుడి నడక వేగం మరింత తగ్గింది.

వెంట ఉన్న శ్రమణులు ఎంత తొందర పెట్టినా అతను తన వేగం పెంచలేదు. వెంట ఉన్న శ్రమణులు "మాకు తలనొప్పిగా ఉంది. త్వరగా జేతవనం చేరదాం" అని తొందర పెట్టినా వృద్ధ స్థవిరుడు తొందర పడలేదు. తన నడక వేగం పెంచలేదు.

"త్వరగా నడవండి... త్వరగా నడవండి" అని అంటూనే ఉన్నారు శ్రమణులు.

కానీ స్థవిరుడు వేగం పెంచలేదు సరికదా, "మీరు నన్ను తొందర పెడుతున్నారు. నా మీద అధికారం చెలాయిస్తున్నారు" అంటూ కినుక వహించి మరింత నెమ్మదిగా నడిచాడు.

జేతవనం చేరిన తరుణ శ్రమణుడు అంతా శుభ్రం చేసి వీరి కోసం ఎదురు చూశాడు. సూర్యాస్తమయం అయినా వారు రాకపోవటంతో మళ్లీ అంతా శుభ్రం చేసి దీపం వెలిగించాడు.

ఒకరితో ఒకరు కలహించుకోవటం వల్ల మిగతావారు రావటం చాలా ఆలస్యమయింది.

వారు వచ్చేసరికి చీకటి పడిపోవటంతో ఆరోజు శాస్తను కలవటానికి వెళ్లలేకపోయారు.

మరుసటి రోజు బుద్ధ సేవార్థం వెళ్లాడు. ప్రణామం చేసి పక్కనే కూర్చున్నాడు.

"ఎప్పుడు వచ్చారు?" అడిగాడు శాస్త.

"నిన్న" సమాధానం ఇచ్చాడు తరుణ శ్రమణుడు.

"వాళ్లు రావటం ఆలస్యం అవటం వల్ల రాలేకపోయాను"

అతడి సమాధానం విన్న శాస్త అన్నాడు "ఇతడు ఈరోజే కాదు, గతంలో కూడా ఇలాగే నిన్ను కష్టపెట్టాడు".

అది విన్న తరుణ శ్రమణుడికి కుతూహలం కలిగింది. పూర్వగాథను వినిపంచమని శాస్తను వేడుకున్నాడు.

అతడి అభ్యర్థనను మన్నించిన శాస్త్ర పూర్వగాథను చెప్పటం ఆరంభించాడు.

.............

**"ఎప్పుడు వచ్చారు?" అడిగాడు శాస్త. "నిన్న" సమాధానం ఇచ్చాడు తరుణ శ్రమణుడు. "వాళ్లు రావటం ఆలస్యం అవటం వల్ల రాలేకపోయాను" అన్నాడు.**

వారణాసిలో బ్రహ్మదత్తుడు రాజ్యం చేస్తున్న కాలం.

ఆ కాలంలో బోధిసత్త్వుడు వారణాసిలో బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. అతడు పెద్దవాడయినప్పుడు అతని తల్లి మరణించింది.

ఆమెకు అంత్యక్రియలు జరిపి, నిర్దిష్ట కర్మలు నిర్వహించిన తరువాత అతడు తండ్రిని తమ్ముడిని వెంట తీసుకుని హిమాలయాలు చేరుకున్నాడు.

దేవదత్తుడి సహాయంతో ప్రవ్రజించాడు. భిక్ష ద్వారా జీవితం గడపసాగాడు. ఫలాలు, కందమూలాలు స్వీకరించి జీవించసాగాడు.

హిమాలయాలలో వర్షాకాలం కందమూలాలను సేకరించటం కష్టం. పండ్లు కూడా లభించటం కష్టం. అందుకని అందరూ కలిసి కింది గ్రామాలకు వెళ్లారు.

అక్కడ లభించిన పూలు, పళ్లు, ఆహారాన్ని సేకరించి తమ నివాసానికి బయలుదేరారు.

అయితే వాళ్ల దారి వేగం మందగించింది.

ఇది చూసి తండ్రిని, తమ్ముడిని మెల్లిగా రమ్మని అతడు వేగంగా తమ నివాసానికి వెళ్లాడు.

కనుక వారు వచ్చేలోగా అంతా శుభ్రం చేశాడు, అలంకరించాడు.

అయితే ఎంతకీ వాళ్లు రాకపోవటంతో మళ్లీ వెనక్కు వెళ్లి, వాళ్లని కలిశాడు. త్వరగా రమ్మన్నాడు.

కానీ ఎవరెంత తొందర చేసినా వాళ్ల తండ్రి నెమ్మదిగానే వచ్చాడు. పైగా "మీరు నన్ను తొందర చేస్తున్నారు, లాక్కుపోతున్నారు" అంటూ దూషించాడు.

వాళ్లు వచ్చేసరికి దీపం వెలిగించాడు. అతడు తండ్రికి కాళ్లు పట్టాడు. తైల మర్దనం చేశాడు.

"పిల్లలు ఎలా మాట్లాడినా పెద్దలు కోపించకూడదు. పెద్ద మనసుతో సహించి క్షమించివేయాలి" అని తండ్రిని బతిమిలాడుకున్నాడు.

"పడుచువారికి సహనం ఉండదు. పెద్దవారు సహనం ప్రదర్శించాలి. వివాదాలను, వాదాలను తీవ్రంగా పరిగణించాలి పెద్దవారు. సంధి విధించాలి. అందరం కలిసి మెలిసి ఉండాలి" అని పెద్దవారు, చిన్నవారికి బోధించాడు. అందరూ కలిసి మెలిసి ఉండేట్టు చూశాడు.

అతని మాటలు విన్న తండ్రి, సోదరుల నడుమ వివాదం సమసింది. శాంతం నెలకొంది.

కథ చెప్పి ధర్మోపదేశాన్ని చెప్పిన శాస్త చివరగా "ఆ కాలంలో తండ్రి స్థవిరుడు, శ్రమణుడు తాపసుడు, తండ్రికి ఉపదేశం ఇచ్చింది నేనే" అన్నాడు.

## సరదా రచనలకు ఆహ్వానం

**జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి. మీ రచనలు పంపించవలసిన చిరునామా:**

**నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.**

**sunmagvaartha@gmail.com**


# మన ఆలోచనలే మనకు వరాలు

డా॥ పులివర్తి కృష్ణమూర్తి

**ఆలోచన అనేది ఒక విధంగా మనిషికి ఒక వరంగానే భావించాలి. అయితే ఒక్కోసారి ఈ ఆలోచనా శక్తిని దుర్వినియోగం గావించడం జరుగుతూ ఉంటుంది.**

**చాలా మంది ఏదైనా సమస్య వచ్చినా, కష్టం ఎదురైనా ఎక్కువగా ఆలోచించడం పరిపాటైపోయింది. ప్రతి చిన్నదాని గురించీ అదే పనిగా ఆలోచిస్తూ వుండటం కొందరికి అలవాటైపోయింది. ఒకటే పనిగా ఆలోచించేవారి శరీర భాగాల మీద దాని ప్రభావం పడుతుంది**

అందువలన అవి మామూలుగా పని చేసే అవకాశం వుండదు. అదే పనిగా ఆలోచిస్తే అవి మామూలుగా పనిచేయవు. అనారోగ్యంపాలు చేస్తాయి. సంతోషకరమైన ఆలోచనలు మానసిక పరివర్తనకు దోహదం చేస్తాయి. ఆరోగ్యమూ చేకూరుతుంది. కారణం?



పరమాత్మ ఈ శరీరంలో సహజంగా వ్యాధి నిరోధక కణాలను వుంచాడు. బ్యాక్టీరియా వంటివి శరీరంలో ప్రవేశించినపుడు వాటితో పోరాడతాయి. అంటే మన శరీరం తన చికిత్సను తానే చేసుకోగలదన్నమాట. ప్రకృతి ఎంతో శక్తివంతమైనది, అద్భుతమైనది. ప్రకృతిసిద్ధమైన ఈ పాంచ భౌతిక శరీరమూ అంతే శక్తివంతమైనది. ఆరోగ్యాన్ని సరిచేసుకోవాలన్న సంకల్పం మనిషిలో వుండి తీరాలి. మానసిక స్థైర్యాన్ని పెంచుకోవాల్సి వుంది. తమ ఆరోగ్యం బాగుపడాలన్న ధ్యాస వుండాలి. అలా వుండగలిగితే శరీరం పూర్తి స్థాయిలో పని చేయడం మొదలు పెడుతుంది. శరీరంలోని నాడుల సమూహాన్ని మెదడు మళ్లీ జాగృతం చేస్తుంది.

ప్రకృతి మనకు సంతోషంతో పాటుగా, మంచి ఆలోచనా శక్తిని కూడా ఇచ్చింది. వీటి ద్వారా మనం అసాధ్యమైన రోగాలను కూడా నయం చేసుకోగలం. ఒక అతీతమైన శక్తి అంటే భగవంతుడు అనేవాడు ఒకడు వున్నాడనే నమ్మకం వుండి, ఆయన మనకు ఎల్లప్పుడూ మనకు సంతోషాన్నీ, కావాల్సిన శక్తినీ ఇస్తుంది. భగవంతుని ఆశ్రయించిన వారికి తక్కువేముంటుంది? భగవంతుడు మనకు సాయం చేస్తున్నాడన్న ఆలోచనే వుంటే అంతకన్నా కావాల్సింది ఏముంటుంది?

దీనివలన ఆంతరంగికంగా సంతోషం పెరిగి, మన శరీరంలోని హార్మోన్లు స్పందిస్తాయి. ఇలాంటి ఆలోచనల వలన ఉల్లాసం, ఉత్సాహం, ఆనందం కలుగుతాయి. సదా ఈ విధమైన మంచి ఆలోచనలను అభ్యాసం చేసుకోవాలి. ప్రసన్నతను మించిన మందు లేదు. అది మనసులోని ముడులను విప్పుతుంది. మన శరీరంలోని ఇండోర్ఫిన్ అనే గ్రంథి మంచి బాధా నివారిణిగా పని చేస్తుంది. మనస్ఫూర్తిగా నవ్వేవారికి, శరీరంలో ఆక్సిజన్ ప్రవాహం పెరిగి, ముఖ్యమైన అవయవాలన్నీ పరిపూర్ణ శక్తితో పని చేయడం మొదలు పెడతాయి.

పసిబిడ్డ రోజుకి 400 సార్లు నవ్వితే పెద్దలు కేవలం 17 సార్లు మాత్రమే నవ్వుతారట. మనం నవ్వినప్పుడు ధ్యాన పూర్వక స్థితిలో వుంటాం. మనం మన ఆలోచనలు అన్నింటినీ పక్కన పెట్టేస్తాం.

నవ్వు చెడును వెళ్లగొడుతుంది. ఒక అద్భుత చికిత్స అది ఆలోచనల్లో సదా సర్వగుణ సాగరుడూ, నిరాకార జ్యోతిర్బిందువైన పరమాత్ముడి చింతన ఉన్నప్పుడు, ఆ తీయనైన స్మృతి మనల్ని శాంతిగా, సంతోషంగా ఉంచుతుంది. సచ్చిదానంద స్వరూపుడైన ఆయనే సదా ఆలోచనల్లో వుంటే మనకు లెక్కలెక్కడివి? భాధలెక్కడుంటాయి? అవి మన ఆలోచనల జోలికే రావు.

మంచి ఆలోచనలూ, మంచి కర్మలూ చేస్తూ మనం మంచిగా జీవిద్దాం! ■

## రచనలకు ఆహ్వానం

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80. sunmagvaartha@gmail.com**

# మూడో మనిషి

(22వ పేజీ తరువాయి..)

“అసలు నీకేమైనా బుద్ధి ఉందా? పెళ్లి చేసుకుని కూడా మొగుడితో కాకుండా అక్కతో, బావతో తిరుగుతానంటే ఏ భర్తయినా భరిస్తాడా? పెళ్లవగానే భర్తే సర్వస్వమనుకునే భార్యలను చూశాను కానీ అక్కా, అక్క కుటుంబం అంటూ భర్తను, సొంత కుటుంబాన్ని అలక్ష్యం చేసే ఆడదాన్ని నిన్నే చూస్తున్నాను.

పెళ్లవగానే సొంత తల్లిదండ్రులనే పట్టించుకోని ఈ రోజుల్లో నువ్వేమిటే అక్కా, బావా అంటూ పాకులాడ్తావు? నీకు వాళ్లు ఏం మందు పెట్టారే? నీ భర్తకు ఏమాత్రం విలువివ్వని అటువంటివాళ్ల కోసమా బంగారం లాంటి భర్తను పోగొట్టుకున్నావు, ఇక అనుభవించు” అని.

ఏ మూహూర్తాన తను ఆ శాపనార్థాలు పెట్టిందో కానీ ఈ ఐదేళ్లలో ఒక్కరోజు కూడా కంటినిండా నిద్ర పోయింది లేదు. భర్త ఆచూకీ తెలుసుకునేందుకు చెయ్యని ప్రయత్నం లేదు. దేవుడి దయ వల్ల ఈ రోజు అనుకోకుండా కళ్లబడ్డాడు.

.........

“కటక్ మీల్స్ సార్. ఎవరైనా బుక్ చేసుకుంటారా?” క్యాటరింగ్ అబ్బాయి కేకతో తమ, తమ ఆలోచనల్లోంచి ఈ లోకంలోకి వచ్చారు చక్రధర్, అరవిందలు.

“ఎక్కడిదాకా ప్రయాణం” అడిగాడు చక్రధర్. “కలకత్తాలో మా కొలీగ్ కొడుకు పెళ్లి. రమ్మంటే వెళ్తున్నాను” బదులిచ్చింది అరవింద.

మీల్స్ బుక్ చెయ్యడానికి ఆ అబ్బాయిని పిలిచాడు చక్రధర్. అతనికి అడ్డు తగిలింది అరవింద “ఇంటి నుండి రొట్టెలు తెచ్చాను, ఇద్దరం కలిసే తినొచ్చు” అంటూ.

చక్రధర్ ఆమెను అడిగాడు “ఎక్కడిదాకా ప్రయాణం” అంటూ.

“కలకత్తాలో మా కొలీగ్ కొడుకు పెళ్లి. రమ్మంటే వెళ్తున్నాను” బదులిచ్చింది అరవింద. రాత్రి రొట్టెలు తింటుండగా అడిగింది “ఈ ఐదేళ్లలో ఒక్కరోజు కూడా నన్ను కలవాలనిపించలేదా?”

“ఎందుకనిపించలేదు... ఎన్నో సార్లు అనుకున్నాను నీ దగ్గరకు రావాలని. కానీ ఆ మహానుభావుడిని చూడాల్సి వస్తుందని రాలేదు” ప్రత్యుత్తరం ఇచ్చాడు చక్రధర్.

“ఇక మీకా బాధ ఉండదులెండి. అక్కా, బావలిద్దరినీ వాళ్ల పిల్లలు వాళ్ల ఊళ్లకు తీసుకుపోయారు” కొంచెం చిలిపితనం మేళవించి అంది అరవింద.

“ఏమో..! ఎవరు చెప్పొచ్చారు. రేపు బుద్ధి మారి మా మరదలు దగ్గరే బాగుందని మళ్లీ తిరిగొస్తే?” తన భయం వ్యక్తపరచాడు చక్రధర్.

“నేను రానిస్తానేమిటి?” కళ్లెగరేస్తూ అంది అరవింద.

“అయితే మరిక ఆలస్యమెందుకు? ఇక్కడి నుంచే లీవ్ అప్లికేషన్లు పంపించేసి మరో హనీమూన్‌కి వెళ్లిపోదాం. ఈసారి ఏకంగా కాశ్మీర్‌కే”.

చాలా రోజుల తరువాత ఆ భార్యా భర్తలిద్దరూ హాయిగా, మనసారా నవ్వుకున్నారు.

# నైరుతి మూల ప్రత్యేకత..

(25వ పేజీ తరువాయి..)

ఇంట్లో ఎవరో ఒకరు అస్తమానం అనారోగ్య సమస్యతో బాధపడుతూ ఉండటం, అందువల్ల హాస్పిటల్స్ కి తరచూ వెళ్లవలసి రావటం ద్వారా తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఏర్పడటం.. ఇలా అనేక రకాలుగా ఉంటాయి. మనలో ఈ దిక్కు గురించి ఒక అవగాహన ఉంటే ఇటువంటి దోషాల ద్వారా వచ్చే చెడు ఫలితాల నుండి సులభంగా తప్పించుకోవచ్చు.

ఇల్లు, స్థలం అన్న తర్వాత నాలుగు దిక్కులు ఉంటాయి. ఇంటికైనా, స్థలానికి అయినా అన్ని దిక్కులు, అన్ని మూలలు సరిగ్గా ఉండేటట్టు మనం చూసుకోవాలి. అలా కాకుండా ఏదైనా పెరగటం లేదా తరగటం వలన దానికి తగిన మంచీ, చెడు కూడా ఉంటాయి. ప్రత్యేకించి నైరుతి మూల వల్ల ఇటువంటి దుష్ఫలితాలు ఉంటాయి. కనుక నైరుతి మూల అంటే సహజంగానే ఒక విధమైన భయం ఉంటుంది. ఇల్లు, ఒళ్లు ఒకలాంటివే! మీకు జ్వరం వచ్చిందనుకోండి.. డాక్టర్ దగరికి వెళ్తే టెంపరేచర్ తగ్గటానికి టాబ్లెట్స్ ఇస్తాడు. ఒక టాబ్లెట్ వేసుకుంటే టెంపరేచర్ నార్మల్ అయిపోతుంది. అలాగని ఎక్కువ టాబ్లెట్స్ వేసుకున్నారనుకోండి. ఒళ్లు చాలా చల్లబడిపోతుంది. అది కూడా ప్రమాదమే కదా! ఇంకా పరిస్థితి క్రిటికల్‌గా మారవచ్చు. అందుకని ఔషధాన్ని ఔషధంగానే తీసుకోవాలి. అలాగే నైరుతి కూడా అంతే! అది ఏ విధంగా ఉండాలో ఆ విధంగా ఉంటేనే అది అద్భుతంగా పని చేస్తుంది. అలా కాకుండా విభిన్నంగా దాని స్వరూపం మారినప్పుడు ఆ దోషం వలన తప్పకుండా చెడు ఫలితాలు ఉంటాయని శాస్త్రం చెప్తుంది.

నైరుతి మూల శక్తి అద్భుతమైనది. ఆ శక్తిని కావలసిన తీరుగా ఉపయోగించుకుంటే ఫలితాలు మాత్రం చాలా విశేషంగా ఉంటాయి. నైరుతి దోషాలు ఉన్నప్పుడు కంగారు పడవలసిన అవసరం లేదు. సరి చేసుకునే పద్ధతులు ఉన్నాయి. సరి చేసుకోలేని పరిస్థితుల్లో ‘ప్రత్యామ్నాయ పద్ధతులు’ కూడా ఉంటాయి.

ఇవి పాటిస్తే నైరుతి దోషాలు శాంతిస్తాయి. క్రమంగా ఫలితాలు మెరుగవుతాయి.




**తన** కాలనీ మొత్తం జలమయం కావడంతో సహాయం కోసం కాల్ సెంటర్‌కు ఫోన్ చేసాడు సుబ్బారావు.

అతి కష్టంమీద ఫోన్ కలిసింది. కానీ ఆ ఫోన్ విన్న తరువాత అతను స్పృహ తప్పిపోక తప్పలేదు.

ఆ ఫోన్‌లో రికార్డు వాయిస్ ఇలా ఉంది..

మీరు రోడ్డుపై వరదలో చిక్కుకుంటే ఒకటి నొక్కండి.

మీకు ఆహార పొట్లాలు లేదా వాటర్ బాటిల్స్ కావాలంటే రెండు నొక్కండి.

ఒకవేళ మీరు కాలనీలో చిక్కుకుంటే మూడు నొక్కండి.

**- కె.లహరి,** కరీంనగర్



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



ప్రతి ఒక్క అంశం గురించి అవగాహన కలిగి వుంటారు. అత్తగారి తరపు బంధువులతో విసిగి పోతారు. దూర ప్రాంత ప్రయాణాలు అసౌకర్యంగా ఉంటాయి. కుటుంబ పురోగతి బాగుంటుంది. పూజల్లో నాగబంధం కుంకుమను ఉపయోగించండి. కుటుంబంలో కొత్త వ్యక్తులకు ఆహ్వానం పలుకుతారు. ఇది నూతన ఉత్సాహానికి కారణమవుతుంది.

## వృషభం



ఆహార, పానీయాల పట్ల అధిక శ్రద్ధ కనబరుస్తారు. విదేశీ ఉత్పత్తుల పట్ల ఆకర్షణ ఉన్నప్పటికీ కొన్ని కార్యక్రమాల నిమిత్తం ఆరోగ్య సూత్రాలు పాటిస్తారు. తల్లిదండ్రులకు ఏ కష్టం కుండా చూసుకోవాలని ప్రయత్నిస్తారు. గోమతీ చక్రాలతో లక్ష్మీదేవి అష్టోత్తరం చదువుతూ అమ్మవారికి పూజ చేయండి. వ్యక్తిగత అభివృద్ధి కోసం తీసుకునే నిర్ణయాలు మేలు చేస్తాయి.

## మిథునం



ఇంట్లోనూ, వ్యాపార ప్రదేశాల్లోనూ నిమిషం తీరిక లేకుండా గడుపుతారు. ప్రతి ఒక్క పని మీరే చేయవల సిన పరిస్థితులు ఏర్పడతాయి. కింది స్థాయి ఉద్యోగులతో సతమతమవుతారు, సమస్యలు ఏర్పడతాయి. ప్రత్యేకింది మహిళలతో మీకు అసంతృప్తి కలుగుతుంది. లక్ష్మీతామర వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయడం మంచిది.

## కర్కాటం



స్నేహితుల వ్యాపారాలలో పెట్టుబడులు పెట్టాలన్న ఆలోచనలు తాత్కాలికంగా విరమించుకుంటారు. సామాజిక దృక్పథంతో ఆశ్రమాలకు, ఓల్డేజ్ హోమ్స్‌కు విరాళాలు అందజేస్తారు. పెంపుడు జంతువులను పెంచుకోవాలన్న ఆలోచనలు ముడిపడతాయి. ఎరుపు వత్తులు, అష్టమూలికా తైలంతో నిత్య దీపారాధన చేయండి. బ్యాంక్ వ్యవహారాల్లో అప్రమత్తంగా ఉండండి.

## సింహం



మీరు పడుతున్న కష్టాన్ని, శ్రమని అయినవాళ్ల కన్నా బయటివాళ్లు ఎక్కువగా గుర్తించి మిమ్మల్ని ఆదరిస్తారు, ఎంతగానో ప్రోత్సహిస్తారు. ఇంట్లో, వ్యాపార ప్రదేశాల్లో దైవికంపొడి, సాంబ్రాణితో ధూపం వేయండి, నరదృష్టి తొలగిపోతుంది. మానసిక ఉత్తేజం కలిగి వుంటారు. జీవిత ఆశయాన్ని సాధించే ప్రయత్నాల్లో అత్యంత చేరువ అవుతారు.

## కన్య



ఎన్నో రోజులుగా నేర్చుకోవాలని ఉబలాటపడుతున్న విషయాలు ఇప్పుడు నేర్చుకోగలుగుతారు. తద్వారా మానసిక తృప్తి కలిగి ఉంటారు. క్రీడా రంగంలో ఉన్నవారికి కాలం అనుకూలంగా ఉంది. పారిశ్రామికవేత్తలకు విదేశీ పర్యటనలు ఉపకరిస్తాయి. పెద్ద సంస్థలతో వ్యాపార ఒప్పందాలు కుదుర్చు కుంటారు. స్వయంకృతాపరాధాలు దొర్లే అవకాశముంది.

## తుల



చిన్న చిన్న సమస్యలతో సతమతమయ్యే అవకాశం ఉంది. ఊపిరితిత్తులు, లివర్‌కు సంబంధించిన అనారోగ్య సమస్యలు వచ్చే సూచనలున్నాయి. నిర్లక్ష్యం చేయకండి. జిల్లేడు వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. ఆటంకాలన్నీ తొలగిపోతాయి. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న శుభవార్త వింటారు. ఇది మానసిక సంతోషానికి, ధైర్యానికి కారణం అవుతుంది. వృత్తిరీత్యా అదనపు బాధ్యతలను మోయాల్సి వస్తుంది.

## వృశ్చికం



చేదోడు వాదోడుగా మీకు అండగా ఉంటారని కొంతమంది వ్యక్తులను చేరదీస్తారు. వాళ్లకి కావలసిన సదుపాయాలు ఏర్పాటు చేస్తారు. మంచితనంతో మీరు చేసిన ఈ పనికి వక్రభాష్యాలు అంటగట్టేవారు తారసపడతారు. మీ వ్యక్తిత్వం తెలిసినవాళ్లు కూడా ఈ రకమైన నిందలు వేయడం మీకు అసహనం కలిగిస్తుంది. సుమంగళి పసుపుతో గౌరీదేవి అమ్మవారి అష్టోత్తరం చదువుతూ అర్చన చేయండి.

## ధనుస్సు



వ్యాపార విస్తరణ కోసం చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. వ్యాపారంలో లాభాలు రొటేషన్ల రూపంలో ఉంటాయి. దూర ప్రాంత ప్రదేశాల్లో పెట్టుబడులు పెట్టాలన్న ఆలోచనలు ముడిపడతాయి. చేతికి సుబ్రహ్మణ్య పాశుపత కంకణం ధరించండి. రాజకీయాల్లో వున్నవారికి అనుకూలంగా ఉంటుంది. కొంత మంది ద్వారా పైవాళ్లతో పైరవీలు జరిపిస్తారు. కొన్ని సదవకాశాలను దక్కించుకుంటారు.

## మకరం



శత్రువర్గాన్ని పూర్తిగా నిర్మూలించలేకపోయినప్పటికీ పక్కకి పారదోలగలుగుతారు కొన్ని ముఖ్యమైన కార్యక్రమాలకు అయినవాళ్లు చేస్తున్న కుట్రలు, కుతంత్రాలు ముందుగానే గ్రహిస్తారు. ఎంతో చాకచక్యంగా, సమయస్ఫూర్తితో నెమ్మదిగా, హుందాగా వ్యవహరిస్తారు. అరటినార వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. మీ సొంతవాళ్లే మీ ప్రవర్తనా తీరులో వచ్చిన మార్పుకి ఆశ్చర్యపోతారు.

## కుంభం




కోపతాపాలకు బానిస కాకుండా ఓర్పుతో మీరు తీసుకునే నిర్ణయాలు మీ అభివృద్ధికి కారణమవుతాయి. పునాదులుగా మారతాయి. శుభ కార్య వ్యవహారాలలో ఘన విజయం సాధిస్తారు. కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తారు. శ్రీ ఆంజనేయ స్వామివారి ఆలయంలో హనుమాన్ సింధూరంతో అర్చన జరిపించి నుదుటన నుదుట దానిని నుదుట ధరించండి.

## మీనం





మీ కష్ట సుఖాలను గుర్తించలేని వారిని మీకు కూడా వద్దనుకుంటారు. ప్రయోజనాలు దక్కకపోయినప్పటికీ ఇలాంటి వ్యక్తులతో మనకి సావాసం అవసరం లేదన్నట్లుగా ఆలోచనలు ఏర్పడతాయి. కోర్టుతీర్పులు అంతంత మాత్రంగా ఉంటాయి. వాయిదాల రూపంలో ఈ విషయాలు ఎన్నో నష్టాలకు కారణమవుతాయి. పూజల్లో నాగబంధం కుంకుమను ఉపయోగించండి. కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకుంటారు.

# ఈ వారం 'కార్టూన్స్'


ఇదేమి డ్రైవింగ్ టెస్ట్ సార్? ట్రాక్ మీద గుంతల్లేవు, డ్రైనేజీ పొంగి లేదు, రాంగ్ రూట్లో ఎవడు ఎదురు రాలేదు.. బర్రెలు అడ్డంగా రాలేదు..ఒక్క కుక్క కూడా వెంట పడలేదు....??!
RTA ఆఫీస్
డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్
Zakir...


సార్ వీడు కల్తీ డ్రగ్స్, కల్తీ గంజాయి సరఫరా చేస్తున్నాడు.. డ్రగ్స్ కేసు బుక్ చేయాలా? కల్తీ కేసా..?
డ్రగ్స్ & నార్కోటిక్స్


600 సిబిల్ స్కోర్ ఉన్నోడికి అడిగినవన్నీ ఇచ్చావు.. 900 స్కోరున్న నాకేమీ ఇవ్వవేంటి స్వామీ?!
Zakir...



మలేసియాలో వున్న ఇపో నగరచిత్రాలివి. ఈ నగరం పర్యాటక ప్రాంతంగా పేరు గాంచింది. బ్రిటీష్ కాలంనాటి ఆర్కిటెక్చర్, సున్నపురాతి కొండలు, గుహ లోపల ఉండే బౌద్ధాలయాలు చూడాల్సినవి.











